నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శుక్రవారం 18-12-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:116 పేజీలు:4 వెల: రూ.1/-

ఓయూలో విద్యార్థి సురేష్ యాదవ్‌పై దాడి

క్యాంపస్‌లో ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
బిజెపి ఎమ్మెల్సీ రామచంద్రరావు పరామర్శ
పలువురు విద్యార్థి నాయకుల ఆందోళన

హైదరాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం రాత్రి 11:30లకు తెలంగాణ విద్యార్థి ఫెడరేషన్ నేత సురేష్ యాదవ్ అనే విద్యార్థిపై జరిగిన దాడితో ఓయూలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ యాదవ్ క్యాంపస్‌లో దీక్షకు దిగారు. ఆయనకు మద్దతుగా విద్యార్థులు తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మరోవపు దాడిని ఖండిస్తూ బిజెపి ఎమ్మెల్సీ రామచంద్రరావు యాదవ్‌ను పరామర్శించారు. ఈ ఘటనపై విచారణ జరపాలన్నారు. మరోవైపు ఘటనపై బిసి జాతీయకమిషన్ సభ్యుడు ఆచారి ఆరా తీసారు. ఇదిలావుంటే తనపై దాడి చేసింది చెన్నూరు ఎమ్మెల్యే బాల్కసుమన్ అనుచరులని సురేష్ యాదవ్ ఆరోపించారు. రాత్రి భోజనం చేసి రూమ్‌లో పడుకునే సమయంలో బాల్కసుమన్ అనుచరులు సుమారు 20 మంది మారణాయుధాలతో దాడిచేశారు. వారి నుంచి తప్పించుకున్న సురేష్ యాదవ్.. ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.'నన్ను కొట్టడానికి 20 మంది రావడంతో నేను రూమ్ నుంచి బయటకు వచ్చి రీసెర్చ్ సెంటర్ వద్ద చెట్లల్లో దాక్కున్నాను. నేను విద్యార్థి సమస్యలపై ప్రశ్నించినందుకే ఈ దాడి జరిగింది. మా బాల్కసుమన్ అన్ననే కాదు.. టీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తే నిన్నే కాదు ఎవరినైనా చంపుతాం అనుకుంటూ వచ్చిన వారు రూమ్‌లోకి బీర్ సీసాలు విసురుకుంటూ వెళ్లిపోయారు. వారంతా వెళ్లిపోయిన తర్వాత ఉస్మానియా క్యాంపస్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారిపై ఫిర్యాదు చేశాను. నాకు బాల్క సుమన్ నుంచి ప్రాణ హాని ఉంది. కావున తక్షణమే వారిని అరెస్టు చేసి నాకు న్యాయం చేయాలని సురేష్ యాదవ్ అన్నారు. విద్యార్థి నేత సురేష్ యాదవ్‌పై జరిగిన దాడిని టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాదిగ ఖండించారు. 'రాష్ట్ర ప్రభుత్వం గత నెల రోజుల నుంచి అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల మీద నాతో పాటు సురేష్ యాదవ్ అన్ని ఉద్యమాల్లో పాల్గొన్నాడు. ఇది జీర్ణించుకోలేని టీఆర్ఎస్ తొత్తులు కొందరు.. సురేష్ యాదవ్‌పై దాడి చేశారు. చెప్పుకోలేని చోట కొట్టారని సురేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాబందుల రాజ్యంలో ఉన్నమా అని కృష్ణ మాదిగ ప్రశ్నించారు. తక్షణమే బాల్కసుమన్ అనుచరులను అరెస్టు చేయాలి అని ఆయన డిమాండు చేశారు. ఇకపోతే తనపై దాడి చేసిన వారిపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేయాలని యాదవ్ డిమాండ్ చేశారు. తెచ్చుకున్న తెలంగాణలో ప్రశ్నించడమే తప్పుగా మారిందన్నారు.

ఓటుకు నోటు కేసులో బాబును చేర్చాలి

ఆర్కె పిటిషన్‌పై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు నాయుడిని ముద్దాయిగా చేర్చాలంటూ దాఖలైన పిటిషన్‌ని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారించింది. వేసవి సెలవుల తర్వాత దీన్ని విచారణ చేస్తామని కోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్ ఆర్కే తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఖచ్చితమైన విచారణ లేదీని నిర్ణయించాలని ప్రశాంత్ భూషణ్ కోరారు. తమ లిఖితపూర్వక ఆదేశాల్లో ఇస్తామని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. ఓటుకు కోట్లు కేసు ఛార్జ్‌షీట్‌లో చంద్రబాబు పేరును 37 సార్లు ప్రస్తావించారు. అయినా ఆ కేసులో చంద్రబాబును ముద్దాయిగా చేర్చలేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు పేరు చేర్చి సీబీఐ దర్యాప్తు జరపాలని కోర్టును అభ్యర్థించారు. రాజకీయ నేతల కేసులను త్వరితగతిన విచారణ జరపాలని ఇటీవలే సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.

రైతులకు నిరసనలు తెలిపే హక్కు ఉంది

అదే సమయంలో చర్చలకు కూడా రావాలి
రైతుల నిరసనలు ప్రాణ,ఆస్తి నష్టాలకు కారణం కారాదు
వ్యవసాయ చట్టాలను నిలుపుదల చేసే విధంగా కేంద్రం ఆలోచించాలి
-రైతుల ఆందోళనలపై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): వివాదాస్పద నూతన వ్యవసాయ చట్టాల అమలును నిలిపి ఉంచాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తెలిపింది. అలాగే నిరసనలు తెలిపే హక్కు రైతులకు ఉన్నా రోడ్లను దిగ్బంధించడం సరికాదని, ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించింది. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు నిర్వహిస్తున్న ఉద్యమం, నిరసనలపై దాఖలైన పిటిషన్లపై విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్లపై వెకేషన్ బెంచ్ విచారణ జరుపుతుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే చెప్పారు. రైతు సంఘాలు కోర్టుకు హాజరు కాకపోవడంతో ఎటువంటి ఆదేశాలను జారీ చేయలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి జస్టిస్ బాబ్డే మాట్లాడుతూ, వివాదాస్పద వ్యవసాయ చట్టాల అమలును నిలిపి వేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం స్పందిస్తూ, అది జరిగే అవకాశం లేదని పేర్కొంది. దీనిపై జస్టిస్ బాబ్డే స్పందిస్తూ, ముందుగానే కాదనవద్దని, దయచేసి సలహాను పరిశీలించాలని చెప్పారు. ఈలోగా రైతు సంఘాలకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. తదుపరి విచారణ వింటర్ వెకేషన్‌లో జరుగుతుందని తెలిపారు. వెకేషన్ బెంచ్‌ని ఆశ్రయించందుకు పిటిషనర్లకు అవకాశం కల్పించారు. ఇదిలావుంటే ఢిల్లీ సరిహద్దుల్లో మూడు వారాల నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న రైతులను రహదారులపై నుంచి ఖాళీ చేయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే.నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నరైతులను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఢిల్లీ నగరంలోకి భారీ సంఖ్యలో ప్రజలు వెళ్లేందుకు అనుమతిస్తే, ఎవరికీ హాని జరగదని, హింస జరగదని ఎవరు హామీ ఇస్తారని ప్రశ్నించింది. ప్రజలను నియంత్రించడం కోర్టుకు సాధ్యం కాదని తెలిపింది. ఉద్రేకపూరితమైన గుంపును న్యాయస్థానం అదుపు చేయజాలదని తెలిపింది. పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులు విచక్షణతో తీసుకోవలసిన నిర్ణయమని తెలిపింది. ప్రాణాలను, ఆస్తులను అపాయంలోకి నెట్టాలనుకోవడం లేదని పేర్కొంది. ఇతరుల హక్కులను పోగొట్టాలనుకోవడం లేదని పేర్కొంది. నగరంలోకి ఎందరిని అనుమతించాలనే అంశంపై అభిప్రాయాన్ని వెల్లడించబోమని పేర్కొంది. దీనిపై నిర్ణయాన్ని అధికారులకే వదిలేయాలని పేర్కొంది. పంజాబ్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన పి చిదంబరం మాట్లాడుతూ, వాళ్ళు గుంపు కాదు, వాళ్ళు రైతులు. అయితే రోడ్లను బ్లాక్ చేసినది పోలీసులు అని చెప్పారు. రోడ్లను దిగ్బంధిస్తున్నామని ప్రకటించిన రైతు సంఘం ఏదైనా ఉందా అని అడిగారు. రైతులు మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. దీనిపై సీజేఐ జస్టిస్ ఎస్ఏ బాబ్డే స్పందిస్తూ, రైతులు కూడా అలాగే అనుకోవచ్చునన్నారు. కేంద్రం మొండి వైఖరితో ఉందని రైతులు భావించవచ్చునన్నారు. చర్చలు జరపడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్న విషయం స్పష్టమవుతోందన్నారు. భారతీయ కిసాన్ యూనియన్ (భాను) తరపు న్యాయవాది మాట్లాడుతూ నిరసనలకు అనుమతించాలన్నారు. జస్టిస్ బాబ్డే మాట్లాడుతూ తాము స్వతంత్ర వ్యవసాయ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడంపై ఆలోచిస్తున్నామన్నారు. ఈలోగా నిరసనలు కొనసాగవచ్చునని, పోలీసులు ఎటువంటి హింసకు పాల్పడరాదని తెలిపారు. రైతులు ఈ విధంగా నగరాన్ని దిగ్బంధించరాదన్నారు. చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కు ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాథమిక హక్కుపై ఆంక్షలు విధించేది లేదన్నారు.

రిజిస్ట్రేషన్ పక్రియలో ఆధార్ వివరాలు ఎందుకు?

వ్యక్తిగా వివరాలు ఎందుకు నమోదు చేస్తున్నారు
ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): రిజిస్ట్రేషన్ పక్రియలో ఆధార్ వివరాలు ఎందుకు అడుగుతున్నారని ప్రభుత్వం హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ధరణి పోర్టల్‌లో వ్యవసాయేతర ఆస్తుల నమోదుపై గురువారం హైకోర్టులో విచారణ మొదలైంది. ధరణి పోర్టల్‌లో ఆస్తుల నమోదుపై కౌంటర్ అఫిడవిట్‌ను ప్రభుత్వం దాఖలు చేసింది. కాగా.. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలంటే 29 పేజీలలో వివరాలు అడుగుతున్నారని పిటీషనర్లు కోర్టుకు తెలిపారు. ఆ 29 పేజీలలో వివరాలు నమోదు చేస్తేనే.. స్లాట్ బుక్ అవుతుందని కోర్టుకు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన హైకోర్టు.. స్లాట్ బుకింగ్‌కు 29 పేజీల వివరాలు తీసుకోవడం అవసరమా అని ప్రశ్నించింది. స్లాట్ బుకింగ్ పేరుతో కొనుగోలు దారులు, అమ్మకం దారుల వ్యక్తిగత వివరాలు తీసుకుంటున్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. రిజిస్ట్రేషన్ కోసం కుటుంబ సభ్యులు, సాక్షుల ఆధార్ కార్డ్ వివరాలు, ఫోన్ నెంబర్లు ఎందుకు తీసుకుంటున్నారని కోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయినా రిజిస్ట్రేషన్లు పాత పద్ధతిలోనే చేస్తామని కోర్టుకు చెప్పిన ప్రభుత్వం.. అలా కాకుండా తాను అనుకున్నదే చేస్తుందని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. రిజిస్ట్రేషన్ పక్రియలో ఆధార్ కార్డ్ ప్రస్తావన రాకూడదని హైకోర్టు స్పష్టం చేసింది. ధరణి పోర్టల్‌లో ఆధార్ కార్డ్ కాలంను తొలగించాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మధ్యాహ్నం సమర్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ధరణిలో వ్యవసాయేతర ఆస్తుల నమోదుపై హైకోర్టులో విచారణ సందర్భంగా ఆస్తుల నమోదుపై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ వేసింది.

గిరిజన సైనిక స్కూల్‌కు మంత్రి ప్రారంభోత్సవం

విద్యతో గిరిజనులు ముందుండాలన్న సత్యవతి

వరంగల్ రూరల్,డిసెంబర్17 (ఆర్ఎన్ఎ): దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ఆశీస్సులతో తొలి గిరిజన

సైనిక్ స్కూల్‌ను ప్రారంభించడం సంతోషం ఉందని గిరిజన, సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లాలోని ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో సైనిక్ స్కూల్‌ను ప్రారంభించడంతో పాటు ఇండియన్ మిలిటరీ వారు అందించిన యుద్ధ ట్యాంక్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఇలాంటి గొప్ప స్కూల్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు అత్యంత క్రమశిక్షణ తో చదివి రాష్ట్రానికి గొప్ప పేరు తేవాలని కోరారు. గిరిజన బిడ్డలు సమాజంలో వారి కాళ్ల మీద వారు నిలబడాలంటే విద్య ఒక్కటే మార్గమని సీఎం కేసీఆర్ ఆలోచించారు. దేశంలో ఎక్కడా లేనన్ని గురుకులాలు మన దగ్గర పెట్టి, అత్యంత పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తూ అత్యంత నాణ్యమైన విద్యను ఇస్తున్నారని పేర్కొన్నారు. 40 మంది గిరిజన ఆడపిల్లలు నేడు గిరిజన గురుకులాల నుంచి ఎంబీబీఎస్ సాధించడం నిజంగా ఎంతో గర్వ కారణమన్నారు. ఇలాంటి విజయాలు సాధిస్తున్న గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అభినందిస్తున్నాను. త్వరలోనే నర్సంపేట నియోజక వర్గంలో గిరిజన గురుకుల విద్యాలయం రాబోతుందన్నారు. సీఎం కేసీఆర్ గిరిజనులకు థర్డ్ ఫేజ్ కరెంట్ అన్ని ప్రాంతాలకు రావాలని నిధులు కూడా ఇచ్చి గిరిజనుల పట్ల ఆయనకున్న అభిమానాన్ని చాటినందుకు ఆయనకు గిరిజనుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ కవిత, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, గిరిజన గురుకుల విద్యాలయ సంస్థల కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ హరిత, ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో హన్మంతు జెండగే, సైనిక స్కూల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు ఆందోళనకు దిగితే ఇబ్బందులు తప్పవు

-రిజిస్ట్రేషన్ శాఖలో తలతిక్క పనులు తగవు: జగ్గారెడ్డి

హైదరాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): రిజిస్ట్రేషన్లపై ప్రజలు ఆందోళనకు దిగితే ప్రభుత్వం ఇబ్బందుల్లో పడటం ఖాయమని కాంగ్రెస్ మ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ తెలిసి చేస్తున్నాడో? తెలియక చేస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. ఆడపిల్లల తల్లి తండ్రులు బిడ్డ పెళ్లికోసం ఆస్తులు అమ్ముకుందాం అనుకున్నా అమ్ముకోలేని పరిస్తితి ఉందన్నారు. ప్రభుత్వం కారణంగా ఆడపిల్లల పెళ్లిళ్లు ఆగిపోయాయన్నారు. ప్రజల ఉసురు ప్రభుత్వానికి తాకుతుందన్న జగ్గారెడ్డి.. అది ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. అధికారుల మాటలు విని సీఎం చెడ్డ పేరు తెచ్చకోవద్దని ప్రభుత్వంలో ఏ అధికారి ఇలాంటి సూచనలు చేస్తున్నాడో అర్థం కావడంలేదన్నారు. నిజాం కాలం నుండే ఆస్తులకు భద్రత ఉందని.. ఐదు నెలల నుండి రిజిస్ట్రేషన్ శాఖ నిలిచి పోయిందన్నారు. కరోనా కాలంలో ఆస్తులు అమ్ముకునో? బ్యాంక్ లోన్లు తెచ్చుకుందాం అనుకున్నా వీలు కాలేదని..అలా ప్రాణాలు పోయిన వారు కూడా ఉన్నారన్నారు. అ÷ూకి కరోనా వస్తే? ఆయన చేతిలో డబ్బులు లేకుంటే డబ్బులు ఎలా తెచ్చుకోవాలో ఆయనకు తెలిసేదన్నారు. రిజిస్ట్రేషన్ శాఖను బందు చేయడం వల్ల ఎంత మంది ఇబ్బంది పడ్డారో అధికారులకు తెలియదని..జనం సమస్యలు అధికారులు చూస్తున్నారో లేదో అర్థం కావడం లేదన్నారు. అధికారులు పిచ్చి ఆలోచనలు మానుకోవాలన్న ఆయన..రాష్ట్రాన్ని దివాళా తీయకండన్నారు. కోర్ట్ ని అడ్డుపెట్టుకుని ఇన్నాళ్లు రిజిస్ట్రేషన్లు ఆపారని..పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేస్తామని కేసీఆర్ అన్నారు కానీ.. అమలు కావడం లేదన్నారు. పాత పద్ధతిలో ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడం లేదో సమాధానం చెప్పాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్ప కూలిందని, సీఎం..సీఎస్ లు తక్షణమే పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఒఖీబ మీద కూడా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని..కేటీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు.

దేవాలయ భూ కబ్జాలపై ప్రభుత్వం ఏం చేస్తోంది

కాళికామాత ఆలయ భూములను పరిశీలించిన చాడ

హైదరాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): దేవాదాయ శాఖకు సంబంధించిన రూ. 100 కోట్ల స్థలాన్ని భూకబ్జా దారులు అక్రమంగా కబ్జా చేస్తుంటే.. దేవాదాయ శాఖ అధికారులు,కేసీఆర్ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. వివాదాస్పదంగా మారుతున్న ఉప్పుగూడ కాళికా మాతా దేవాలయానికి సంబంధించిన 24,25,26 సర్వే నెంబర్లలోని 7ఎకరాల 30 గుంటల స్థలాన్ని చాడ వెంకట్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. చెరువులు, కుంటలతో పాటు దేవాదాయశాఖ స్థలం కబ్జాకు గురవుతున్నా ..తెలంగాణ ప్రభుత్వం గుడ్డి ప్రభుత్వంలా వ్యవహరిస్తున్నదని, కళ్ళు లేని ప్రభుత్వంలా వ్యవహరిస్తుందన్నారు. లాలితాబాగ్ కాళికా మాత గుడి స్థలాలను కాపాడింది సీపీఐ పార్టీ అని , అస్థలం రక్షణకు ఎంతకైనా తెగిస్తామని, మరో రెండు రోజుల్లో దేవాదాయ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఇస్రో చరిత్రలో మరో ఘన విజయం

సమాచార సాంకేతిక రంగంలో మరింత దూకుడు
నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్‌వీ సీ-50 రాకెట్
రాకెట్ ప్రయోగంతో మెరుగైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు

నెల్లూరు,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): ఇస్రో మరో ఘనతను చాటింది. సమాచార రంగంలో మరో విప్లవానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ-50 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. సరిగ్గా మధ్యాహ్నం 3.41 గంటలకు సమాచార ఉపగ్రహం సీఎంఎస్-01ను మోసుకుంటూ నిప్పులు చెరుగుతూ నింగికెగసింది. కేవలం 20 నిముషాల్లోనే అది తన కక్షలోకి చేరింది. నిజానికి ప్రయోగం పలుమార్లు వాయిదా పడి చివరికి గురువారం చేపట్టారు. ఈ ప్రయోగం ద్వారా దేశంలో ఇకపై మెరుగైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు లభించ నున్నాయి. దీని పరిమితి భారత్‌తో పాటు అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌కు విస్తరించనుంది. ఏడు సంవత్సరాల పాటు సేవలు అందించనున్న ఈ ఉపగ్రహం బరువు 1410 కిలోలు. భారత్ ప్రయోగించిన 42వ కమ్యూనికేషన్ ఉపగ్రహం ఇది. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 50వది కాగా, పీఎస్ఎల్వీ సీ-50 ఎక్స్ఎల్ ఆకృతిలో 22వది. షార్ నుంచి ఇది 77వ మిషన్ అని ఇస్రో పేర్కొంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంత దీనిని తయారు చేశారు. సి-బ్యాండ్ సేవల విస్తరణకు ఈ ప్రయోగం దోహదపడుతుందని ఇస్రో చైర్మన్ కె.శివన్ తెలిపారు. రెండు టన్నులకు మించి బరువు కలిగిన అతి పెద్ద ఉపగ్రహాలను ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష సంస్థల నుంచి ఇస్రో పంపిస్తోంది. అతి చిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీల ద్వారా ప్రయోగించి వాణిజ్యపరంగా ఇస్రోకు ఆదాయాన్ని తీసుకొచ్చేగనిగా మారింది. చంద్రయాన్, మంగళ్‌యాన్ లాంటి గ్రహాంతర ప్రయోగాలు, ఒకేసారి పది ఉపగ్రహాలు, 20 ఉపగ్రహాలు, ఆ తరువాత 104, మళ్లీ 38 ఉపగ్రహాలను సునాయాసంగా మోసుకెళ్లి అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగలిగిన ఘనత పీఎస్ఎల్వీకే సొంతం. ఇప్పటి వరకు 51 పీఎస్ఎల్వీ రాకెట్లను ప్రయోగించగా అందులో రెండు మాత్రమే విఫలమయ్యాయి. గురువారం నాటి ప్రయోగంతో మరో కీలక ఘట్టానికి షార్ వేదికైంది. భవిష్యత్తులో ఇంకా ఎక్కువ ఉపగ్రహాలను భూమికి 800 కిలోమీటర్ల ఎత్తు నుంచి 504 కిలోమీటర్లు తగ్గించుకుంటూ వస్తే 8 రకాల కక్ష్యల్లోకి ప్రవేశపెట్టే ప్రవేశపెట్టాక పీఎస్ 4 దశను మండించి మళ్లీ కిందికి తీసుకొచ్చి 508 కిలోమీటర్ల ఎత్తులో కొన్ని ఉపగ్రహాలు, 505 కిలోమీటర్ల ఎత్తులో మరికొన్ని ఉపగ్రహాలను ప్రవేశపెట్టి అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్ర సృష్టించింది కూడా పీఎస్ఎల్‌వీ రాకెట్టే కావడం గమనార్హం.

వీలుంటుందని గుర్తించింది పీఎస్ఎల్వీ రాకెట్టే కావడం గమనార్హం. పీఎస్ఎల్వీ సీ 45లోని పీఎస్ ? 4 దశ ముందుగా 753 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రనస్ ఆర్బిట్‌లో ఈఎంఐ శాట్ అనే ఉపగ్రహాన్ని

భారత్ మా నిజమైన మిత్రదేశం



మా స్వాతంత్రం కోసం పోరాడిన ఘనత
వర్చువల్ సమావేశంలో బంగ్లా ప్రధాని షేక్ హసీనా

న్యూఢిల్లీ,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): బంగ్లాకు భారత్ నిజమైన మిత్రదేశమని ఆ దేశ ప్రధాని షేక్ హసీనా అన్నారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి వర్చువల్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1971 యుద్ధంలో బంగ్లాకు మద్దతు ఇచ్చినందుకు దేశానికి, భారత సైన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 'డిసెంబర్ బంగ్లాదేశీయుల్లో ఆనందం, స్వేచ్ఛ, వేడుకల స్ఫూర్తిని రేకెత్తిస్తుందని' అన్నారు. భారత్ సారథ్యంలో తాము గొప్ప స్వాతంత్ర్యాన్ని సంపాదించామన్నారు. ఈ సందర్భంగా యుద్ధంలో మరణించిన మూడు మిలియన్ల మంది అమర జవాన్లకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. మా దేశం కోసం తమ హృదయపూర్వక మద్దతును అందించిన ప్రభుత్వానికి, భారత ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, బంగబంధు ముజిబుర్ రెహ్మాన్ డిజిటల్ ఎగ్జిబిషన్ ప్రదర్శనను ప్రారంభించారు. అలాగే 55 సంవత్సరాలుగా నిలిచిపోయిన చిలహతి, బెంగాల్ హల్దిబారి రైలు మార్గాన్ని ఇద్దరు ప్రధానులు ప్రారంభించారు.

భీంపూర్ అడవుల్లో పులిదాడులు

ఆదిలాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): జిల్లాలోని భీంపూర్ మండలంలో వరుసగా పులి దాడులు చోటుచేసుకుంటున్నాయి. పెన్‌గంగా తీరం గొల్లఘాట్ దగ్గర ఆవుపై పులి దాడికి పాల్పడింది. అలాగే పశువుల కాపరులను కూడా పులి పరుగులు పెట్టించింది. పులి సంచరిస్తున్నట్లు స్థానికులకు తెలియడంతో తీవ్ర భయందోళనకు గురవుతున్నారు. పొలంలోకి వెళ్తే ఏ క్షణాన ఏమౌతుందోనని ప్రాణాలు గుప్పెట్లోపెట్టుకుని జీవిస్తున్నారు. అటవీశాఖ అధికారులు పులిని బంధించాలని వేడుకుంటున్నారు.

దశాబ్దాలనాటి కలల ప్రాజెక్టు పూర్తి.. త్వరలో ప్రారంభం : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 17: ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాలను కలుపుతూ రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామం వద్ద గోదావరి నదిపై నిర్మించిన నూతన వంతెనను ఎమ్మెల్సీ కవిత గురువారం పరిశీలించారు. వంతెన పరిశీలన సందర్భంగా గోదావరి మాతకు ఆమె నాణెలు సమర్పించి ప్రణమిల్లారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. దశాబ్దాల నాటి కలల ప్రాజెక్టు పూర్తి అయిందన్నారు. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల మధ్య రాకపోకల సమస్య తీరనున్నట్లు తెలిపారు. ఈ కలని సాకరం చేయడంలో ఎంతో మద్దతునిచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలన్నారు. మంచి విషయాలు సహజంగా సమయం తీసుకుంటాయంటారు. కానీ తాను దాన్ని అంగీకరించలేనన్నారు. ఎంపీగా బోర్నపల్లిలో వంతెన నిర్మిస్తానని 2014లో వాగ్దానం చేశాను. ప్రజల సౌకర్యం కోసం అతి త్వరలోనే వంతెన అందుబాటులోకి వస్తుందని ఆమె పేర్కొన్నారు.

చరిత్రలో నేటినిజం



రాజధానిపై రాజకీయ క్రీనీడ !

నేటినిజం
శుక్రవారం 18-12-2020

దేశంలో బహుశా ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండదు. విభజిత ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు రాజధాని లేని రాష్ట్రంగా కొనసాగుతోంది. ఉట్టికి ఎగరలేనమ్మ ఆకాశానికి ఎగిరిందన్న సామెతను రుజువు చేస్తూ ప్రస్తుత పాలకులు తాము పట్టిన కుందేటికి మూడే కొమ్ములన్నట్లుగా చేస్తున్న యత్నంలో మూడు రాజధానుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు. ఏడాదిగా అసలు రాజధాని వద్ద ఎలాంటి కార్యక్రమాలు లేకుండా వైజాగ్, కర్నూల్ అంటూ పిల్లి కూనలను తిప్పినట్లు తిప్పుతున్నారు. దూరదృష్టి ఉండాల్సిన నేతలు లేని కారణంగా...స్వార్థం నరనరాన జీర్ణించుకుని సంపాదనే ధ్యేయంగా ఉన్న నేతలు పాలకులుగా ఉంటే ఎలా ఉంటుందుందో అమరావతి వ్యవహారమే ఇందుకు నిదర్శనం. అమరావతి పేరుతో చంద్రబాబు ఆయన అనుయాయులు వేలాది ఎకరాలు సేకరించారన్న ఒకేఒక్క కారణంతో మూడు రాజధానులంటూ జగన్ చదరంగం ఆడేస్తున్నారు. నిజానికి గతంలో మద్దతు పలికిన నేత మడమ తిప్పడం, నాలుక మడతేయడం ఎందుకన్నది అందరికీ తెలుసు. చంద్రబాబు నిజంగానే భూమి సేకరించి ఉంటే..వాటికి సంబంధించిన వివరాలను రాబట్టి ఆ భూములను ప్రభుత్వం భూసేకరణ చట్టం ద్వారా స్వాధీనం చేసుకోవచ్చు. సులువుగా చేయాల్సిన పనిని క్లిష్టంగా తయారు చేయడం వెనక మతలబు ఏంటన్నది తెలియనిది కాదు. ఈ వ్యవహారంలో కేంద్రం కూడా చోద్యం చూస్తోంది. బృహత్తరమైన రాజధాని నిర్మించాల్సిన పాలకులు తమ స్వప్రయోజనాల కోసం ఆటలాడడం తగదు. అంతేగాకుండా ఎపికి చెందిన మేధావులు కూడా గమ్మున ఉన్నారు. ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదు. ఎక్కడా బయటకు రాడం లేదు. ఏడాదిగా అమరావతి రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదు. విభజన జరిగి ఆరేళ్లు అయినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పష్టమైన రాజధాని లేదు. జగన్ ప్రభుత్వం వికేంద్రీకరణ పేరిట చేసిన చట్టాలపై ప్రస్తుతం హైకోర్టులో రోజువారి విచారణ జరుగుతోంది. తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లడం తథ్యం. అప్పుడు ఎంత సమయం పడుతుందనేది ఇప్పుడే చెప్పలేం. అమరావతినే కొనసాగించాలంటూ సాగే ఉద్యమానికి ఏడాది నిండింది. గురువారం నాడు అమరావతి జెఎసి నేతలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆందోళన కారులను అడ్డుకోవడం మినహా ప్రభుత్వం చేయగలిగిందీ లేదు. రాజు నిరంకుశుడు అయినా ఫర్వాలేదు కానీ..మొండోడు అయితే తట్టుకోవడం కష్టం. మళ్లీ ఎన్నికల వరకు ప్రజలు ఇలా చోద్యం చూడాల్సిందే. అలాంటప్పుడు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు కూడా అసవరం లేదు. అధికారులు బ్యాగులు చంకన పెట్టుకుని ఎక్కడి నుంచయినా తమ కార్యకలాపాలు నిర్వహిస్తే సరిపోతుంది. ముఖ్యమంత్రి జగన్ తన పాదయాత్రలో గాని ,గెలిచాక గానీ రాజధానిని మారుస్తానని చెప్పలేదు. సీనియర్ మంత్రి బొత్స కృష్ణానదికి వచ్చిన వరదను సాకుగా తీసుకుని రాజధాని మార్చే ఆలోచన వున్నట్టు సూచనగా బయట పెట్టడంతో అసలు కుట్ర బయటకు వచ్చింది. చంద్రబాబు హయాంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటూ అటూ ఇటూ తిప్పి మూడు రాజధానుల వ్యవహారాన్ని మెల్లగా బయటపెట్టారు. రాజధానిని మార్చడం అనకుండా అన్ని ప్రాంతాలకు సమన్యాయం పేరిట వికేంద్రీకరణ అంశాన్ని ప్రచారం చేపట్టారు.

న్యాయ, కార్యనిర్వాహక, శాసన రాజధానుంటూ ఫార్ములా త్రీ తీసుకొచ్చారు. అప్పటి నుంచి అమరావతిలో ఆందోళన సాగుతున్నది. ఏడాదిగా రైతులు ఉద్యమిస్తున్నారు. అన్ని పార్టీలు మూడు రాజధానుల ఫార్ములాను వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యమంత్రి నివాసం పక్కనే నిరాహారదీక్షలు చేసే వారితో కనీసంగా కూడా మాట్లాడలేదు. వారిని కేవలం చంద్రబాబు తొత్తులుగానో పెయిడ్ ఆర్టిస్టులుగానో చూస్తూ మొహం చాటేశారు. అమరావతి విషయంలో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతిన్నాయి. చంద్రబాబు తన వారికి

కాంట్రాక్టులు పనులు కట్టబెట్టిన తర్వాత ప్రస్తుత పాలక పార్టీకి లాభం లేకపోగా నష్టం కలుగుతోంది. అప్పుడూ ఇప్పుడూ కూడా రాజధాని నిర్మాణం కోసం నిధులు అందుబాటులో లేవు. వైసీపీ రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోణంలో విశాఖ ఉత్తరాంధ్ర ఒక వైపు రాయలసీమ మరో వైపు ప్రముఖ స్థానం ఆక్రమిస్తున్నాయి. విశాఖ ఎపిలో ఏకైక పారిశ్రామిక ఆర్థిక నగరం గనక కొద్దిపాటి కార్యాయాల నిర్మాణాలతో రాజధాని నడిపించుకోవచ్చన్నది జగన్ ప్రభుత్వ వ్యూహంగా ఉంది. అయితే అక్కడే రాజధానిని పూర్తిగా ఏర్పాటు చేసినా బాగుండేది. అలా కాకుండా కర్నూలులో కొంత, ప్రస్తుత అమరావతిలో కొంత అన్న చందంగా మూడుకాల్లు మోపుతానని అంటున్నారు. కేంద్రం కూడా రాజధాని వ్యవహారంలో తమ ప్రమేయం లేదని తేల్చేసింది. దీంతో జగన్ కూడా ఇక వ్యవహారం అంతా తమ ఇష్టం అన్నరీతిలో సాగుతున్నారు. ఎపి బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు తాము అమరావతినే ఏకైక రాజధానిగా కోరుకుంటున్నామని చెబుతున్న ప్పటికీ అందుకు కేంద్రం మద్దతు ఉందా లేదా తెలియదు. రాజధానికి భూములు అప్పగించిన రైతులు, దళితలు, వ్యవసాయ కార్మికులు మాత్రం ఏడాదిగా ప్రత్యేకంగా పోరాడుతున్నారు. నిషేదాజ్ఞలు విధించడం ప్రతిపక్ష నాయకులను నిరోధించడం సర్వసాధారణంగా అమలైంది. భూములు విలువ పెరిగి తమకు అపారమైన లాభం వస్తుందని స్థానిక రైతులు నమ్మి భూములను ఇచ్చారు. కొందరి నుంచి బలవంతంగా లాక్కున్నారు. సింగపూర్ ప్రణాళికతో నవనగరాలు, మాల్స్ , ఐకానిక్ టవర్స్, రివర్ ఫ్రంట్ హ్యాపీ నెస్ట్ ప్రతిదీ రియల్టర్ల భాషలో చంద్రబాబు గ్రాఫిక్స్ చూపారు. భూములనే పెట్టుబడిగా వాడుకోవచ్చని లక్ష కోట్ల వరకూ చెప్పి, చివరకు నిధులు లేక బాండ్లు అమ్మిఅప్పులు తెచ్చుకోవలసిన దుస్థితిని తసీఉకుని వచ్చారు. పాలకులకు రాజకీయ క్రీడకు మాత్రం ఏడాది కావస్తోంది.అప్పుడు చంద్రబాబు..ఇప్పుడు జగన్ ఇద్దరూ రాజధాని పేరుతో దోచుకోవాలని చూస్తున్నారే తప్ప రాష్ట్ర పురోభివృద్ధిపై ఏ మాత్రం శ్రద్ధగా లేరనడానికి ప్రస్తుత దుస్థితే నిదర్శనంగా చెప్పుకోవాలి.

విజయవాడలో ఘనంగా బిసి సంక్రాంతి

అట్టహాసంగా బిజి కార్పోరేషన్ల భేటీ

హాజరైన సిఎం, మంత్రులు,ఎమ్మెల్యేలు

సిఎం జగన్ బిసిల పక్షపాతి అని మంత్రుల పొగడ్తలు

విజయవాడ,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం బీసీ సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయ 10 గంటలకు ప్రారంభమైన ఈ సభలో బీసీలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నెల రోజుల ముందే సంక్రాంతి పండగ వచ్చిందనే విధంగా బీసీలు సంబరాలు

జరుపుకున్నారు. బీసీ సంక్రాంతి సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిరావ్ పూలే, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరయ్యారు. పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.దేశ, రాష్ట్ర చరిత్రలో ఇదివరకెన్నడూ లేని విధంగా 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం.. వాటికి చైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటించడం తెలిసిందే. కేబినేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 60 శాతం మంత్రి పదవులు కల్పించగా, నామినేట్ పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించారు. వెనుకబడిన కులాల అభివృద్ధి కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ప్రతీ సంక్షేమ పథకం కార్పొరేషన్ల ద్వారానే అమలు చేయనున్నారు. ఒక్కో కార్పొరేషన్‌లో 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. దీని ద్వారా 2కోట్ల 83లక్షల 57వేల మంది బీసీలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. రూ.37,931 కోట్ల మేర ప్రభుత్వం లబ్ది చేకూర్చింది. ఈ నేపథ్యంలో వారందరి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బీసీల సంక్రాంతి పేరుతో నిర్వహిస్తున్నారు. ఇందులో సగానికి పైగా పదవులను మహిళలకు కేటాయించారు. బీసీలు అంటే నమ్మకానికి ప్రతీక అని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బీసీలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. గత పాలకులు బీసీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఏకైక సీఎం జగన్ అని ప్రశంసించారు. 139 కులాలకు కార్పొరేషన్లు ప్రకటించిన ఘనత సీఎం జగన్‌దే కార్పొరేషన్ పదవులలో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారని ఎమ్మెల్యే విడదల రజనీ అన్నారు. సంక్షేమ పథకాల్లో బీసీలే అధికంగా లబ్ది పొందుతున్నారని పేర్కొన్నారు. బీసీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. పేద బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సీఎం జగన్ అని కొనియాడారు. రాజకీయ చరిత్రలోనే ఇదొక సువర్ణాధ్యాయమని ఎంపీ మోపిదేవి వెంకట రమణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి, బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. దేశం అంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రి కావాలని కోరుకుటున్నారని పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ రోజు వెనుకబడిన జాతులకు స్వాతంత్యం వచ్చిన రోజు అని ఆయన అన్నారు. మాట నిలుపునే మనిషి మడమ తిప్పని సీఎం వైఎస్ జగన్‌ను తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలు కోరుకుంటున్నాయన్నారు. కరోనా సమయంలో పథకాలతో పేదలకు అండగా నిలిచారని అభివర్ణించారు. 139 బీసీ కులాలకు అండగా నిలిచిన వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. వెనుకబడిన జాతుల వ్యక్తిగా తమ పార్టీకి సేవ చేస్తానని స్పష్టం చేశారు. సంక్రాంతి, క్రిస్మస్ కన్నా వెనుకబడిన జాతులకు ఈరోజు స్వాతంత్యం వచ్చిన రోజు అని అన్నారు. వెనుక బడిన జాతులకు వెన్నుపోటు పొడిచి నాయకులను గతంలో చూశామని డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తన క్యాబినెట్‌లో బీసీలకు ఏడుగురురికి.. మంత్రులుగా వెనుక బడిన వారికి అయిదు డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది. ఇద్దరు బీసీ నాయకులను రాజ్యసభకు పంపారు. ఇలాంటి మహానాయకుడిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిప్రక్ష నాయకుడు చేస్తున్న కుతంత్రాలు, సింహాల్లా తిప్పి కొట్టాలి. విద్యా, వైద్యంలో బడుగులకు ప్రాధాన్యత ఇచ్చారు. మరో 30 సంవత్సరాలు రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగుతారని పేర్కొన్నారు. బీసీలు అంటే భారత దేశ సాంస్కృతిక అన్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి వేణుగోపాల్ కృష్ణ అన్నారు. 56 బీసీ కార్పొరేషన్లు,673 డైరెక్టర్ల పోస్టుల్లో మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. బీసీల గుండెల్లో గుడి కట్టుకున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని, బీసీ అధ్యాయన కమిటీతో వెనుక బడిన కులాలు గుర్తించారన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకున్న నేత సీఎం జగన్ అని పేర్కొన్నారు. బీసీలకు సంక్రాంతి నెల ముందే వచ్చిందని ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తి పేర్కొన్నారు. దేశంలో అన్ని వర్గాలు అభివృద్దే దేశ అభివృద్ధి అని అంబేద్కర్ తెలిపారని, ఆయన ఆశయాలతో సీఎం పాలన సాగిస్తున్నారన్నారు. '3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర ద్వారా పేదల కష్టాలు తెలుసుకున్నారు. బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతయి. దేశంలో బీసీ కులాల 139 బీసీ కులాలు ఉన్నాయి. ప్రతి కులాన్ని వదిలి పెట్టకుండా 56 కార్పొరేషన్లు ,673 డైరెక్టర్ల ఇచ్చారు. గత పాలకులు కేవలం బీసీలను ఓటు బ్యాంకుగానే చూశారు. బీసీ వర్గాలకు మేలు చేసిన మహానాయకుడు సీఎం జగన్. అని అన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎంలు, కృష్ణ దాస్,అంజాద్ బాష, మంత్రులు, బొత్ససత్యనారాయణ, అనిల్ కుమార్ యాదవ్,వేణుగోపాల కృష్ణ, శంకర్ నారాయణ, జయరాం, సీదిరి అప్పల్ రాజు,అవంతి శ్రీనివాస్,కొడాలి నాని,పేర్ని నాని,కన్నబాబు, అదిమూలపు సురేష్, ఎంపీలు,బాల శౌరి, మోపిదేవి వెంకట రమణ, సుభాష్ చంద్రబోస్,భరత్, నదిగాం సురేష్, తదితరులు హాజరయ్యారు.

నెహ్రూ జూ పార్క్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్

-అభినందించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్16ః7(ఆర్ఎన్ఎ): అత్యంత నాణ్యమైన ప్రమాణాలను పాటిస్తూ, అందరి ప్రశంసలు పొందుతున్న నెహ్రూ జూలాజికల్ పార్కు ఐఎస్ఓ పొందడం ఎంతో హర్షణీయమని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి. అన్నారు జూ పార్కులో ప్రతీ విభాగంలో పాటించబడుతున్న ఐఎస్ఓ ప్రమాణాలను గుర్తించి వారికి ఈ సర్టిఫికెట్ ప్రధానం చేయటం జరిగిందని మంత్రి తెలిపారు.ముఖ్యంగా శానిటేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, యానిమల్ బ్రీడింగ్, జూ హాస్పిటల్, యానిమల్ కేర్, హైజీన్ మెయి÷-టనెనెన్స్ ఎస్టాబ్లిషమెంట్ లను ఐఎస్ఓ నిపుణుల బృందం తనిఖీ చేసింది. ఈ బృందం అన్ని విషయాలతో పాటు, వివిధ విభాగాల్లో పాటిస్తున్న ప్రమాణాలను కూడా పరిశీలించింది. జూ సిబ్బంది సమర్థవంతంగా, అంకితభావంతో పనిచేయటం, జంతువుల పట్ల మానవతా దృక్పధం తో సేవలందించుట నిపుణులకు బాగా నచ్చిన విషయాలు. ప్రతి పనిలో పారదర్శకత, 24 గంటల అన్ని అత్యవసర పరిస్థితులలో సిబ్బంది స్పందించే విధానం గొప్పగా ఉందని నిపుణుల బృందం అభిప్రాయపడింది. ఈ సమాచారాన్ని, గణాంకాలను యుకె అ?రక్రిడేషన్ వారికి పంపించి, నెహ్రూ జూలోజికల్ పార్కు ఐఎస్ఓ పొందటానికి చాలా ఖచ్చితమైన సిఫార్సు పంపటం జరిగింది. యూకే అక్రిడియేషన్ కమిటీ ఇవన్నీ పరిశీలించి, ముఖ్యంగా జూ సందర్శకుల సంతృప్తిని కూడా పరిగణలోకి తీసుకుని సర్టిఫికేషన్ ప్రదానం కోసం అప్రూవల్ ఇచ్చారు. కరోనా కష్టకాలంలో 24 గంటలు పని చేసిన సిబ్బంది యొక్క నిబద్ధత, పాటించిన శుభ్రతా చర్యలు చాలా హర్షణీయమని కార్యక్రమంలో పీసీసీఎఫ్ ఆర్. శోభ అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ, ఐఎస్ఓ పొందిన మొట్ట మొదటి జూ దేశంలోనే నెహ్రూ జూలాజికల్ పార్కు కావటం గర్వకారణం అన్నారు.

దేశ వ్యవసాయ విధానంపై చర్చించాలి?

హైదరాబాద్, డిసెంబర్ 17:మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ బిల్లులను రద్దు చేయాల్సిందేనంటూ దేశ రాజధాని ఢిల్లీలో రైతాంగం సాగిస్తున్న పోరాటాన్ని అత్యధికులైన రాజకీయ పార్టీలు బలపరుస్తున్నాయి. అయితే ఇదొక చర్చనీయాంశమైన సందర్భం. ఈ సమయాన్ని రాజకీయ పార్టీలు తమ స్వలాభం కోసం.. లేదా మోడీపై వ్యతిరేకత చాటుకోవడానికి కాకుండా రైతాంగ సమస్యలపై సమగ్ర విధాన రూపకల్పనకు కేటాయించాలి. వ్యయసాయ నిపుణులతో రౌంట్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేసి సమగ్ర చర్చలకు అవకాశం ఇవ్వాలి. ఎలా అయితే మనరైతాంగం బతికి బట్టగలదో ఒక సమగ్ర ఆలోచనకు శ్రీకారం చుట్టాలి. ఇదొక సంధికాలంగా గుర్తించి రాజకీయ పార్టీలు దేశంలో విప్లవాత్మక రైతు విధానాలను అవలింబించడం ఎలా అన్నది ఆలోచన చేయాలి. రైతులు పండించే పంటలకు మెరుగైన ధరలు వచ్చేలా..మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేలా.. వినియోగదారులు అంటే ప్రజలకు నాణ్యమైన పంట ఉత్పత్తులను సరసమైన దరలకు అందించేలా పక్కా ప్రణాళిక రూపొందించాలి. అలా చేస్తే రైతాంగమే కాకుండా ప్రజలు కూడా వారివెంట నడుస్తారు. రైతులు చేస్తున్న ఆందోళనను నిప్పురాజేసే కార్యక్రమంగా కాకుండా దేశానికి అవసరమైన రీతిలో పార్టీలు ఆలోచన చేయాలి. భారతదేశం ఆహార భద్రత కలిగి వుండాలంటే ఆ తిండిని మనమే పండించుకోవాలి. మన భూముల మీద ఏ పంటలు పండించాలి..వాటికి మార్కెట్ ఎలా అన్నది చర్చించాలి. మనదగ్గర పండించే పంటలను మనం పండించుకోవాలే తప్ప ఇబ్బడిముబ్బడిగా దిగుమతి చేసుకునే దురవస్థను దూరం చేసుకోవాలి.

రైతుల పొలాల నుంచి మార్కెట్ వరకు పంటలను తరలించడం ఒక ఎత్తయితే ..పంటలు పండించేందుకు అవసరమైన విత్తనాలు, నీరు, విద్యుత్, రసాయానాలు తదితర అంశాలన్నీ ఇందులో ఇమిడి ఉండాలి. అలాగే పంటపెట్టుబడులు కూడా ముఖ్యమే. మన సమాజం సజావుగా నడవాలంటే ఏ పంటలు పండించాలన్న విషయంలో ప్రభుత్వ బాధ్యత తప్పకుండా ఉండాలి. అలాగే ప్రభుత్వం ఆహార ధాన్యాల ధరలను కూడా నియంత్రించాలి. వాటిని స్వేచ్ఛా మార్కెట్ శక్తులకు విడిచిపెట్టకూడదు. వ్యవసాయ రంగంలో స్వేచ్ఛా మార్కెట్ విధానం అన్నది రైతులకు మేలు చేసేదిగానే ఉండాలి. స్వేచ్ఛా మార్కెట్ విధానం మొత్తంగా ఆర్థిక వ్యవస్థకి మేలైన పరిష్కారం అవునా కాదా అన్న చర్చ కూడా చేయాలి. ఇదే సందర్భంలో రైతుల కష్టార్జితంతో పాటు పంటలకు అయిన పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుని ఏ పంటకు ఎంత ధర ఉండాలన్న నిర్ణయం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఖచ్చితంగా జరగాలి. దానిని ఎవరు కూడా అతిక్రమించకుండా కొనుగోళ్లు సాగించాలి. అలాగే మన దేశ ప్రజల ఆహార అవసరాలకు అనుగుణంగా ఏ సంవత్సరం ఏ పంట వేయాలన్న నిర్ణయం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరగాలి. ఏ వ్యవసాయ పంట ఎంత పరిమాణంలో పండించాలన్నది కూడా ముందే నిర్ణయం జరగాలి. కేవలం మార్కెట్ పెత్తనానికి వదిలిపెడితే అప్పుడు వారు ధరలపై స్వారీ చేస్తారు. ఇక్కడ పంటలని అంటే ఆహార ధాన్యాలతో పాటు, పళ్లు, కూరగాయలు, పాలు,మాంసం, కోల్లు, చేపలు ఇలా తినే పదార్థాలన్నీ అని గణించాలి. మన ఆకలిని బట్టి ఆహారం తీసుకుంటాం తప్ప ఆహారధాన్యం ధరను బట్టి కాదన్న విషయం పరిగణించి ప్రతి ఒక్కరికి పుష్టికరమైన ఆహారం అందేలా ప్రభుత్వం ప్రణాళిక రచించాలి. అయితే ఆహార ధాన్యాల ఉత్పత్తి మాత్రం ప్రకృతి సానుకూలంగా ఉందా లేక ప్రతికూలంగా ఉందా అనే దానిని బట్టి ఆధారపడి మారుతూ వుంటుంది. అందువలన ఆహార ధాన్యాల ధరలలో తరుచూ హెచ్చుతగ్గులు ఉంటాయి. ఇది ఆహార ధాన్యాలకే కాదు, ఏ వ్యవసాయ పంటకైనా వర్తిస్తుంది. ధాన్యానికి ధర తగ్గిపోతే రైతులు అప్పులపాల వుతారు. అదే ధర పెరిగితే వినియోగదారులు కొనలేక ఆకలి చావులపాలవుతారన్న సూత్రాన్ని కూడా బేరీజు వేసుకుని మన

వ్యవసాయ ప్రణాళికలు తయారు చేసుకోవాలి. తిండిగింజల ధరలు పెరిగితే పర్యవసానంగా ప్రజలు తక్కిన ఇతర సరుకులను కొనుగోలు చేయగల శక్తిని కోల్పోతారని గ్రహించాలి. మన దేశంలో దశాబ్దాల కృషి తర్వాత ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. అందులో కనీస మద్దతు ధరలు, సేకరణ విధానం, పంపిణీ విధానం, ఆహార సబ్సిడీలు వంటివి ఉన్నాయి. స్వేచ్ఛా మార్కెట్ వలన ఇవన్నీ కుప్పకూలుతాయన్న ఆందోళన ప్రస్తుత రైతాంగంలోనూ, సమాజంలోనూ ఉంది. దేశ రాజధానిలో కొనసాగుతున్న రైతు ఆందోళనల గురించి ప్రజల కళ్లు తెరిపించడానికి భారతీయ జనతాపార్టీ, కేంద ప్రభుత్వం తలపెట్టిన అవగాహనాకార్యక్రమాల విధానానికి అనుగుణంగా ప్రధాని ప్రసంగాలు, ప్రకటనలు ఉంటున్నాయి. వ్యవసాయ సంస్కరణల చట్టాల మంచిచెడ్డలను పక్కనబెడితే, ఆందోళనను ఎదుర్కొన దానికి ప్రభుత్వం, అధికారపక్షం అనుసరిస్తున్న వ్యూహం ఏంటంటే రైతులను ప్రతిపక్షాల పక్కదోవ పట్టిస్తున్నాయని ప్రచారం చేయడం. రైతులు అమాయకులు, వారిని ఇతరులు తప్పదోవ పట్టిస్తున్నారు. ఆ ఇతరులు ఎవరంటే కాంగ్రెస్,ఇతర ప్రతిపక్షాలు, ఖలిస్థానీ తీవ్రవాదులు, మావోయిస్టులు అని చెబుతున్నారు. అయితే ఇవన్నీ ఎలా ఉన్నా ఆందోళనలకు మద్దతుగా నిలిచిన వారు తమ వద్ద ఉన్న ప్రణాళిక ఏంటన్నది చెప్పాలి. వేం అధికారంలోకి వస్తే..అన్న సంగనాచి కబుర్లకు కాలం చెల్లింది. ఎందుకంటే గతంలో వీరంతా అధికారం వెలగబెట్టిన వారే. ప్రస్తుత ప్రణాళికలు అన్నీ గతంలో చేపట్టినవే. కాబట్టి సమగ్ర వ్యవసాయ విధానాలను చర్చించి ముందుకు తీసుకుని వస్తేనే ప్రజలు కూడా నమ్ముతారని రాజకీయ పార్టీలు గుర్తించి ముందుకు సాగడం విజ్ఞత అనిపించుకుంటుంది.

రాజధాని ప్రహసనంలో అసలు దోషి కేంద్రం

విభజన చట్టం మేరకు రాజధాని నిర్మించే బాధ్యత దానిదే

శంకుస్థాపన చేసిన ప్రధాని చోద్యం చూడడం సరికాదు

అమరావతి,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): అమరావతి రాజధాని నిర్మాణ ప్రహసనంలో అసలు సూత్రధారి బిజెపి అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఓ రాష్ట్రం రాజధాని లేకుండా అటూఇటూ తిరుగుతుంటే పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్రం చేష్టలుడిగి చూడడమే గాకుండా తమకేమీ సంబంధం లేదని తేల్చేయడం దారుణం. ఎపికి ఢిల్లీని మించిన రాజధాని కట్టిస్తానని ఊదరగొట్టిన నరేంద్రమోడీ మట్టి తెచ్చి నీళ్లు పోసి అమరావతి శంకుస్తాపన చేశారు. ఆ తరవాత అసలా విషయాన్ని మరచిపోయారు. నిధులు విదిల్చించి కూడా నామమాత్రమే. రాజధాని మార్పులతో కేంద్రానికి సంబంధం లేదని మూడు సార్లు అఫిడవిట్లు ఇచ్చారు. రాష్ట్రంలో మాత్రం బిజెపి నేతలు మరోలా మాట్లాడుతున్నారు. రాజకీయ అవసరాల రీత్యా బిజెపికి లోబడి వుంటున్న వైసీపీ అధినేత జగన్‌ను మోడీ వద్దని వారిస్తే ఇంత రచ్చ జరిగేది కాదు. రాజధాని నిర్మాణం సజావుగా సాగేది. ఈ పాటికి పూర్తయ్యేది కూడా. ఇప్పటికైనా అఖిలపక్ష సమావేశం జరిపి అందరి అభిప్రాయాలు తీసుకుని ప్రజాస్వామికంగా అడుగేస్తే అమరావతికి న్యాయం చేయడం అసాధ్యమేమీ కాదు. మూడు రాజధానులపై అసెంబ్లీలో తీర్మానం చేసి సంవత్సరం గడిచిపోయింది. అమరావతి రైతులు, ప్రజానీకం చేపట్టిన ఉద్యమం ప్రారంభమై సంవత్సరం నిండింది. ప్రభుత్వం సంక్షేమ పథకాలు చేపట్టినా ఎక్కువ భాగం వివాదాస్పద నిర్ణయాలు, కక్ష రాజకీయాలు, వ్యతిరేక చర్యలతో కాలం గడిచిపోయింది. పాలన కూడా కుంటుపడుతోంది. ముఖ్యమైన అంశాలపై లిటిగేషన్లతో ప్రభుత్వం కోర్టుల చుట్టూ తిరుగుతోంది. ఈ కాలంలో రాజధాని అభివృద్ధి స్తంభించింది. సంక్షేమం కొంతలో కొంత మెరుగైనా రాష్ట్రమంతా అభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. నాడు ప్రపంచ స్థాయి, అద్భుత రాజధాని అంటూ టిడిపి ప్రభుత్వం ఆశలు రేకెత్తించింది. పరిమిత పనులతో సరిపెట్టింది. నేడు రాజధానిని ముక్కలు చేసే పేరుతో ప్రాంతీయ వైషమ్యాలను రెచ్చగొట్టి లబ్ది పొందాలని వైసిపి ప్రయత్నిస్తోంది. ఆరున్నర సంవత్సరాల నుండి కేంద్రంలో బిజెపినే అధికారంలో కొనసాగుతోంది. రాజధానికి, రాష్ట్రానికి బిజెపి, కేంద్రం ఒరగబెట్టిందేమీ లేదు. బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజుకు మాత్రం అమరావతి అకస్మాత్తుగా గుర్తొచ్చి..మోడీ ప్రతినిధిగా అంటూ ఊరడించే మాటలు చెప్పి పోయారు. 2024లో రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకుని వస్తే రాజధానిని 5 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పరుస్తామని సెలవిచ్చారు. ఆరున్నరేళ్ల నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న విషయం మర్చిపోయిన కమలనాథులు ఇప్పుడు మళ్లీ మాటలే చెబుతున్నారు తప్ప చేతల్లో చూపడం లేదు. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రంలో టిడిపితో కలిసి బిజెపి అధికారంలో కొనసాగినా అమరావతికి చేసిందేమీ లేదు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం బాధ్యత కేంద్రానిదే. రాజధాని శంకుస్థాపన సందర్భంలో మోడీ చెంబుడు నీళ్లు, పిడికెడు మట్టి తెచ్చి రాజధానికి నిధులు ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజల నోట్లో మట్టి కొట్టారు. గత రెండు సంవత్సరాల నుండి కేంద్ర బ్జడెట్లో అమరావతి ప్రస్తావనే లేదు. విజయవాడ మెట్రో గాలికొదిలేశారు. అమరావతికి రైలు ప్రాజెక్టు ఏనాడో మర్చిపోయారు. ప్రత్యేక హోదా మాట ఇచ్చి నమ్మించి మోసం చేసింది బిజెపి కాదా? అన్నది గుర్తు చేసుకోవాలి. ఇకపోతే ఇప్పటికే రాజధాని కోసం వెచ్చించిన ప్రజా ధనం నిరుపయోగమైనా వారికి పట్టడం లేదు. ఏడాదిగా అమరావతి కోసం ఆందోళన చేస్తున్న వారిని అధికార పార్టీ పదేపదే వారిని పెయిడ్ ఆర్టిస్టులని, బినామీలనీ అవహేళన చేయడం సరికాదు. రాయల సీమను అభివృద్ధి చేయడం, విశాఖ విస్తరణ

హైదరాబాద్ తరవాతి స్థానం వరంగల్‌దే

అత్యున్నత నగరంగా తీర్చిదిద్దుతున్నాం

పాలకవర్గ సమావేశ మందిరాన్ని ప్రారంభించిన ఎర్రబెల్లి

వరంగల్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం వరంగల్ అని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వరంగల్‌ను అత్యున్నత నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. అందుకు అనుగుణంగా నిధులు వెచ్చించి ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో పాలక వర్గ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అలాగే వరంగల్ మహా నగర పాలక సంస్థలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తున్నదని తెలిపారు. వరంగల్ మహానగరం రాష్ట్రానికి రెండో రాజధానిగా వెలుగొందుతున్నది. వరంగల్‌ను ప్రణాళికా బద్ధంగా నిర్మించేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కంకణ బద్ధులై ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతుందన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం రూ.300 కోట్లు వరంగల్ కోసం బ్జడెట్ కేటాయిస్తుందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అమలు లోకి తెచ్చామన్నారు. వరంగల్లో ఇంటింటికీ ప్రతి రోజూ మంచినీరు విడుదల చేయనున్నామని తెలిపారు. కరోనా కారణంగా అన్ని పనులు ఆగి పోయాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం జరుగుతున్నది. ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలన్నారు. కరోనా, వరదల సమయంలో ఈ పార్టీలు ఎక్కడకు పోయాయాయని ప్రశ్నించారు. కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలతో కలిసి సమన్వయం చేసుకుంటూ, నగర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీలు బండా ప్రకాష్, పసునూరి దయాకర్, మేయర్ గుండా ప్రకాశ్ రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, అరూరీ రమేష్, చల్లా ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య, కలెక్టర్, కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో భగీరథ నీటి వాటర్‌బాటిల్స్

భగీరథ నీటిపై ప్రజల్లో చైతన్యం నింపాలి

అధికారులతో సిఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్ సమీక్ష

హైదరాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మిషన్ భగీరథ నీటిని మాత్రమే ప్రజలు వినియోగించేలా ప్రజల్ని చైతన్య పరిచే కార్యక్రమాలు మరిన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితాసబర్వాల్ అన్నారు. స్వచ్ఛమైన తాగునీరు ఇంకెక్కడా దొరకదన్నారు. మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో అన్నిజిల్లాల సీఈ, ఎస్ఈతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొత్తగా నిర్మిస్తున్న రైతు వేదికలు, వైకుంఠ దాఆలకు భగీరథ నీటిని అందించాలని ఆమె సూచించారు. అంగన్ వాడీలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, వైద్య సంస్థలతో పాటు ధార్మిక సంస్థలకు వాటర్ కనెక్షన్‌లు ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో భగీరథ నీటి వాటర్‌బాటిల్స్‌ను ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా రోజువారీ తాగునీటి సరఫరా తీరును ఈఎన్‌సి కృపాకర్ సీఎంవో కార్యదర్శికి వివరించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథతో శుద్ధి చేసిన తాగునీరు అందుతోందన్నారు. అనుకున్న పరిమాణం కంటే ఎక్కువగానే నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు వివరించారు. సరఫరాతో పాటు నీటి నాణ్యతపై దృష్టిపెట్టామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జోరుగా సాగుతున్న స్టెబిలైజేషన్ కార్యక్రమాల్లో ఇంటిజటికీ సరఫరా అవుతున్న నీటి నాణ్యతను కూడా పరీక్షిస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ వాటర్ టెస్టింగ్‌లతో ప్రజల్ని చైతన్య పరుస్తున్నట్టు తెలిపారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేసిన స్మితాసబర్వాల్ వంద శాతం స్టెబిలైజేషన్‌సాధించిన అధికారులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఈ నెల చివరి నాటికి మారుమూల ప్రాంతాలన్నింటికీ భగీరథ నీటిని ందించాలన్నారు. జనవరిలో నిర్వహించే సమావేశం నాటికి రాష్ట్రంలోని అన్ని ఐసోలేషన్ ఆవాసాలకు భగీరథ నీరు సరఫరా కావాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్ తో పాటు చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలుపాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగి కూతురు వివాహ వేడుకల్లో పాల్గొన్న టిపిసిసి కార్యదర్శి ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో గురువారం మహా లింగేశ్వర గార్డెన్ లో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఉద్యోగి గౌరీశంకర్ కూతురు వివాహ వేడుకల్లో టిపిసిసి కార్యదర్శి ఆది శ్రీనివాస్ పాల్గొని. నూతన వధూవరులను ఆశీర్వదించారు ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కనికరపు రాకేష్, కొలకని రాజు, ఎర్ర శ్రావణ్, వస్తాది కృష్ణా గౌడ్, శశాంక్, దినేష్, తదితరులు ఉన్నారు

దొంగతనాలు అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలి

-వేములవాడ పట్టణ పరిధిలో గల బ్యాంకులకు నోటీసులు జారీ:

-పట్టణ ఇన్స్పెక్టర్ ఓ. వెంకటేష్

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి లోని బ్యాంకు అధికారులకు మరియు ప్రజలకు తెలియజేయునది ఏమనగా కొంతమంది అంతరాష్ట్ర దొంగల ముఠా కు చెందిన దొంగలు మొన్నటి రోజున రాత్రి సమయంలో మానకొండూర్ మండలం ఊటురు గ్రామంలోని బ్యాంకు లో మరియు కరీంనగర్ పట్టణం లోని ఒక షాపులో కూడా దొంగతనం చేయడానికి ప్రయత్నం చేసినారు కావున బ్యాంకు అధికారులు మీ మీ బ్యాంకుల వద్ద, ఏటి ల వద్ద తగిన సెక్యూరిటీ ఏర్పాట్లు చేసుకోవడమే కాకుండా అఐ కెమెరాలు ఏర్పాటు చేసుకొని అవి సరిగా పనిచేసేలా చూసుకోవాలని వేములవాడ పరిధిలో గల బ్యాంకు యాజమాన్యం కు నోటీసు లు జారీ చేరినట్టు ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. అదేవిదంగా జువేల్లరి షాపు యజమానులు , మొబైల్ షాపు యజమానులకు, ఇతర షాపుల యజమానులకు మీ మీ షాపుల ముందు మరియు ప్రజలు కూడా మీ ఇళ్ళ ముందు అఐ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మీ మీ షాపుల ముందు తగిన సెక్యూరిటీ ఏర్పాట్లు చేసుకోవాలని దొంగ తనం జరుగక ముందే తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలను కోరారు.అంతే కాకుండా ఎవరైనా అనుమానాస్పదంగా కన్పించినట్లయితే వెంటనే "డయల్100" కు కానీ లేదా సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలపాలని కోరారు. పోలీస్ శాఖ తరుపున రాత్రి పూట పెట్రోలింగ్ మరియు బీట్స్ పెంచమని ప్రజలు కూడా పోలీస్ వారికి సహకరించి దొంగ తనాలు అరికట్టుటలో సహకరించాలని కోరారు.

ట్రంప్ ఇక దారికి రాక తప్పదు

హూందాగా ఓటమిని అంగీకరించి దిగిపోవాల్సిందే

కాదూకాకూడదంటే గెంటివేసే ప్రమాదమూ లేకపోలేదు

వాషింగ్టన్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): అమెరికాలో ఇక మదతపేచీలు పెట్టేందుకు ట్రంప్‌కు ఎలాంటి అవకాశం కూడా లేదు. తోటమిని గౌరవంగా అంగీకరించి వైట్‌హౌజ్ నుంచి తప్పుకుంటే సరేసరి లేకుంటే చట్టమే తప్పిస్తుంది. జో బైడెన్ గెలుపు నిర్ధారణ అయిన తరవాత కూడా ఇంకా పేచీలు పెట్టే కుసంస్కృతికి ట్రంప్ దూరంగా ఉంటే మంచిదన అక్కడి పౌరులుకూడా తెగేసి చెబుతున్నారు. మొన్నటి అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్, కమలా హారిస్ ఘన విజయం సాధించారనీ, అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షులు ఇక ముమ్మాటికీ వారేనని 306 ఓట్లతో ఎలక్టోరల్ సమావేశం నిర్ధారించింది. ఎన్నికల్లో అన్యాయాలూ అక్రమాలూ చేసి బైడెన్ నెగ్గకొచ్చాడంటూ న్యాయస్థానాలను ఆశ్రయించిన ట్రంప్‌కు అక్కడా వరుస ఎదురుదెబ్బలు తగిలినా బుద్ధి మారలేదు. ట్రంప్ ఇంకా ఎంతకాలం అదే అర్థంలేని మొండిపట్టుదల ప్రదర్శిస్తే అంతమేరకు తనతో పాటు, పార్టీ పరువు కూడా పోతుందని గుర్తించాలి. అమెరికా ఎన్నికల వ్యవస్థనీ, ప్రజాస్వామ్యాన్ని అప్రదిష్ట పాల్జేసిన అపఖ్యాతి ఆయనతో పాటు పార్టీ మెడకూ చుట్టుకుంటుంది. ఇకపోతే ఎలక్టోరల్ కాలేజీ ఓటింగ్ తరువాత రిపబ్లికన్ నాయకులు దిగిరాక తప్పడం లేదు. ఆ పార్టీ సీనియర్ నాయకుల్లో ఒకరైన మిచ్ మెక్‌కానెల్ కొత్త అధ్యక్ష ఉపాధ్యక్షులకు తన బహిరంగ మద్దతు ప్రకటించడమే కాక, ఎన్నికల ఫలితాలను ప్రశ్నించడం, అనుమానించడం ఇక మనం మానుకోవాలని పార్టీకి హితబోధ కూడా చేశారు. ట్రంప్‌కు సుప్రీంకోర్టులో కూడా చుక్కెదురవడం, ఎలక్టోరల్ కాలేజీ బైడెన్ పక్షాన నిలవడంతో రిపబ్లికన్ సెనేటర్లు ఒకరి తరువాత ఒకరు ఎన్నికల ఫలితాలను ఎదురు ప్రశ్నించవద్దని వ్యాఖ్యానించడం ఆరంభించారు. ఎలక్టోరల్ కాలేజీ ఫలితాలకు లాంఛనప్రాయమైన ఆమోదముద్ర వేసేందుకు జనవరి 6న జరగబోయే పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశానికి ఎంతోముందుగానే రిపబ్లికన్‌పార్టీ నేతల వైఖరిలో ఈ మార్పు రావడం, బైడెన్‌తో కలసిపనిచేస్తామని అనేకులు ప్రకటించడం ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బగా భావించాలి. సుప్రీంకోర్టు తీర్పును సైతం తప్పుబడుతున్న ట్రంప్, తన ఓటమి విషయంలో ఇంతవేగంగా రాజీపడకపోవచ్చునని విశ్లేషణలు వెలువడుతున్నాయి. బైడెన్‌ను నిలువరించడానికి మరిన్ని మార్గాలు వెదుకుతామంటూ ఆయన అనుయాయులు చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బైడెన్ ప్రమాణ స్వీకారం తరువాత కూడా ట్రంప్ తన వైఖరి వదలకపోయినా ఆయనకు వ్యక్తిగతంగా వచ్చిన నష్టమేమీ ఉండదు. అతిఘనమైన ప్రజాస్వామ్యదేశంగా చెబుతున్న అమెరికాలో ఎన్నికల పక్రియ ఇంత సుదీర్ఘంగా, సంక్లిష్టంగా, వివాదాస్పదంగా ఉండటం చూసి ప్రపంచం ఆశ్చర్య పోతున్నది. నియంతృత్వ దేశాల్లో తప్ప ప్రజాస్వామిక దేశాల్లో చూడని విచిత్రమైన ఘట్టాలు ఇక్కడ కనిపిస్తున్నాయి. అధికార బదలాయింపు ఎంతో గౌరవంగా, సునాయాసంగా జరిగేట్టు చూడాల్సిన బాధ్యతను రిపబ్లికన్ నాయకులు ఇప్పటికైనా నెత్తికెత్తుకోవాలి. తాను ఓడిపోలేదని నమ్ముతున్న ట్రంప్ నాలుగేళ్ళ తరువాత మళ్ళీ పోటీచేసి తనే అధ్యక్షుడిగా వస్తానని చెప్పినందున ఆ మేరకు తన ప్రయత్నాల్లో ఉంటే మంచిది.

ఇండియన్ పోస్టల్ ద్వారా డాక్‌పే యాప్

ఆవిష్కరించిన కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) కన్నమర్క కోసం సరికొత్త యాప్ రూపొందించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్సు సహకారంతో డిజిటల్ పేమెంట్ అప్లికేషన్ 'డాక్‌పే'ని పరిచయం చేసింది. కేంద్ర కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, లా అండ్ జస్టిస్ మంత్రి రవిశంకర్ ప్రసాద్ 'డాక్‌పే' యాప్‌ని లాంఛ్ చేశారు.

దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ఉన్న సమయంలో ప్రత్యక్షంగా, డిజిటల్ పద్ధతుల్లో అనేక పోస్టల్ సేవల్ని అందించడంలో ఇండియా పోస్ట్ ముందుందని, ఈ యాప్ ద్వారా బ్యాంకింగ్ సేవల్ని, పోస్టల్ ప్రొడక్ట్స్‌ని ఆన్‌లైన్‌లో పొందడం మాత్రమే కాదు, పోస్టల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌ని ఇంటి దగ్గరే పొందొచ్చని ఆయన అన్నారు. కోవిడ్ 19 పై పోరాటంలో భాగంగా డోర్ స్టెప్ బ్యాంకింగ్ సేవల ద్వారా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. డిజిటల్ లావాదేవీలు, బ్యాంకింగ్ సేవల కోసం ఈ యాప్ ఉపయోగించుకోవచ్చు.

ఆర్థిక లావాదేవీల కోసం దేశప్రజల్ని డిజిటల్ వైపు నడిపించేందుకు భారత ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఈ యాప్ తయారు చేసింది. 'డాక్‌పే' యాప్‌ను కస్టమర్లు గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశంలో ఎక్కడికైనా డబ్బులు ట్రాన్స్ఫర్ చేయొచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్స్ చేయొచ్చు. వర్చువల్ డెబిట్ కార్డ్, యూపీఐ ద్వారా మనీ ట్రాన్స్ఫర్ చేయొచ్చు. బయోమెట్రిక్స్ ద్వారా క్యాష్‌లెస్ లావాదేవీలు జరిపేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఏ బ్యాంకు కస్టమర్లు అయినా బ్యాంకింగ్ సేవలతో పాటు బిల్ పేమెంట్ సేవలు పొందొచ్చు. ఇటీవల ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ) పెన్షనర్ల కోసం డోర్‌స్టెప్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సర్వీస్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

పెన్షనర్లు నామినల్ ఫీజు చెల్లించి ఇంటిదగ్గరే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయొచ్చు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్-(ఐపీపీబీ) 2018 సెప్టెంబర్ 1న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైంది. ఇది 100 శాతం భారత ప్రభుత్వానికి చెందిన బ్యాంకు. దేశవ్యాప్తంగా ఉన్న 1,55,000 పోస్ట్ ఆఫీసుల నెట్‌వర్క్, 3,00,000 పోస్టల్ ఉద్యోగుల సహకారంతో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా బ్యాంకింగ్ సేవలు అందుతున్నాయి.

విడాకులు, మెయిన్‌టేనెన్స్, వారసత్వ హక్కులు

ఒకే రకమైన చట్టం వర్తింప చేయాలంటూ పిటిషన్

వేర్వేరు చట్టాలు సరికాదన్న పిటిషన్‌పై సుప్రీం విచారణ

కేంద్రానికి నోటీసులు జారీ చేసిన ఉన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): విడాకులు, మెయిన్‌టేనెన్స్, వారసత్వ హక్కుల విషయంలో ఒకే రకమైన విధానాన్ని పాటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారించింది.

విభిన్న మతాల వారికి ఇలాంటి అంశాల్లో వివిధ రకాలు ఉండడం సరికాదంటూ పిటిషనర్ పేర్కొన్నాడు. ఇలా ఒకే విధానం అమలు చేయడం సాధ్యమా ? ఇలాంటి అంశాలపై దాఖలైన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు విచారించింది. వారసత్వ హక్కుల విషయంలో ఉన్న అవరోధాలను తొలగించాలంటూ దాఖలైన పిల్‌ను స్వీకరించిన సుప్రీం.. ఆ కేసులో కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

డైవర్స్, మెయిన్‌టేనెన్స్ లాంటి కేసుల్లో దేశ ప్రజలందరికీ ఒకే చట్టాన్ని అమలు చేసే అంశంపై అభిప్రాయాలు ఇవ్వాలంటూ కేంద్రాన్ని సుప్రీం కోరింది. చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిల్‌ను విచారించింది.

అయితే ఇలాంటి పిటిషన్లను ప్రోత్సహించడం వల్ల వ్యక్తి చట్టాలను విస్మరించినట్లు అవుతుందని సీజే అభిప్రాయ పడ్డారు. వ్యక్తిగత చట్టాలను రద్దు చేయాలని మీరు కోరుతున్నారు, మీరు నేరుగా ఆ అంశాన్ని అడగపోయినా.. కానీ జరిగేది అదే కాదా, పర్సనల్ చట్టాలను ఎలా నిర్వీర్యం చేస్తామని సీజేఐ బోబ్డే అన్నారు. సీనియర్ అడ్వకేట్లు పింకీ ఆనంద్, మీనాక్షీ అరోరాలు పిటిషనర్ అశ్వినీ కుమార్ యాదవ్ తరపున వాదించారు. హిందువులు, క్రైస్తవులు, ముస్లింలకు.. ఏ మతం ఆధారంగా ఒకే రకమైన విధానాన్ని పాటించడం వీలవుతుందని సీజే బోబ్డే ప్రశ్నించారు.

అట్టహాసంగా ధూళిమిట్ట మండల ఆవిర్భావోత్సవం

హాజరైన మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

సిద్దిపేట,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): సిద్దిపేట జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ధూళిమిట్ట మండల కేంద్రం ఆవిర్భావ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జిల్లా ఇంఛార్జి కలెక్టర్ ముజమిల్ ఖాన్‌లు పాల్గొన్నారు. మండల కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రజాప్రతినిధులకు స్థానిక మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ళు, మంగళ వాయిద్యాల మధ్య వండుగ వాతావరణంలో ధూళిమిట్ట మండల ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం ఘనంగా జరిగింది. ప్రజలు భారీగా హాజరై ఆవిర్భావ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదట ధూళిమిట్ట సెక్షన్ సహాయ ఇంజనీర్(ఆపరేషన్) కార్యాలయాన్ని మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. అనంతరం సహాయ ఇంజనీర్(ఆపరేషన్)గా ఎల్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. సిద్దిపేట జిల్లాలో ధూళిమిట్ట కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. హన్స్నాబాద్ డివిజన్‌లోని 8 గ్రామాలతో ధూళిమిట్ట మండలాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు బుధవారం నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. ధూళిమిట్ట మండలంకోసం రాష్ట్రప్రభుత్వం అక్టోబర్ 11న అభ్యంతరాలను స్వీకరిస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యంతరాలన్నింటినీ పరిశీలించిన ప్రభుత్వం తుది ఉత్తర్వులు వెల్లడించింది. ధూళిమిట్ట మండలంలో ధూళిమిట్ట, లింగాపూర్, జాలపల్లి, తోర్నల, బైరాన్‌పల్లి, బెక్కల్, కొండాపూర్, కూటిగల్ గ్రామలు వస్తాయి.

మహిళా సంఘాలకు స్త్రీనిధి సురక్ష

అర్హత కలిగిన సభ్యులకు సులభ రుణాలు

ప్రకటించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

జనగామ,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): రాష్ట్రవ్యాప్త మహిళా సంఘాల సభ్యులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుభవార్త చెప్పారు. స్త్రీ నిధి సురక్ష- బి అనే పథకం అమలుకు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అర్హత గల ప్రతి సభ్యురాలు మూడు ఏండ్లకు ఒక్కసారి 690 రూపాయలను ప్రీమియంగా చెల్లించాలి. ఈ నిధి మొత్తాన్ని తిరిగి సులభ వాయిదాల్లో చెల్లించే విధంగా మహిళలకే రుణంగా అందిస్తారు. ఈ పథకంలో చేరిన సభ్యురాలు మరణిస్తే రూ. లక్ష వరకు సభ్యురాలి వారసులకు చెల్లిస్తారన్నారు. మహిళలందరికీ తాను చెప్పేది ఒక్కటేనని మహిళలు అభివృద్ధి చెందితే ఆ కుటుంబంతో పాటు, సమాజం, గ్రామం, దేశం కూడా బాగుపడుతుందన్నారు. బుధవారం స్త్రీ నిధి పథకం కింద ఉపాధి కోసం రుణాలు పొందిన మహిళలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొందిన రుణాలు మీ అభివృద్ధికి తోడవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మహిళా శక్తిని గుర్తించి, వారి అభివృద్ధికి స్త్రీ నిధి సంస్థను ఏర్పాటు చేసిన ఘనత మన రాష్ట్రానిదేనన్నారు. 2020-21 ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ నిధి కింద రూ. 2 వేల 400 కోట్లు రుణాలను అందిస్తున్నది. ఇప్పటి వరకు రూ. వెయ్యి 140 కోట్లను రాష్ట్రంలోని 2 లక్షల 74 వేల మంది సభ్యులకు ఇచ్చామన్నారు. మిగతా మొత్తాన్ని 31 మార్చి, 2021 లోగా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. జనగామ జిల్లాలో 3 వేల 587 మంది సభ్యులకు స్త్రీ నిధి నుండి రకరకాల ఉపాధి కోసం రూ. 19 కోట్ల 90 లక్షలను రుణాలుగా ఇస్తున్నం. ఇందులో 8 కోట్ల 37 లక్షలు 900 పాడి పశువుల కొనుగోలు కోసం, 39 లక్షలు 13 ఎలక్ట్రిక్ ఆటోల కోసం, ఇతర ఉపాధుల కోసం రూ. 11 కోట్ల 14 లక్షలు ఇవ్వడం జరిగిం దన్నారు. సంఘంలోని ఒక్కో మహిళకు రూ. 5 వేల నుండి రూ. 3 లక్షల వరకు రుణాలుగా అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల వడ్డీ కంటే తక్కువ కేవలం 11.5 శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తున్నట్లు వివరించారు. వసూలు చేసే వడ్డీలో 10 శాతం తిరిగి మహిళా సంఘాలకే అందజేస్తున్నట్లు చెప్పారు. మహిళా సమాఖ్యలకు ఇచ్చే వడ్డీ కూడా బ్యాంకుల వడ్డీ కంటే 3 శాతం ఎక్కువ అన్నారు. పాలిచ్చే పాడి పశువుల కొనుగోలుకు రూ. 75 వేలు, 50 నుండి 100 పెరటి కోళ్ళ పెంపకం కోసం ఒక్కో సభ్యురాలికి రూ. 12 వేల 500 నుంచి రూ. 22 ఎలు, పెరటి కోళ్ళ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు రూ. 3 లక్షలు, ఒక్కో ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలుకు రూ. 3 లక్షలు, చిన్న చిన్న దుకాణాలు పెట్టుకునే ందుకు రూ. 10 వేల వరకు రుణాలుగా అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

సంక్షేమమే లక్ష్యంగా కెసిఆర్ పాలన

-ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్

మహబూబాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): మహబూబాబాద్ మండలంలోని మొట్ల తండాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ప్రారంభించారు. అనంతరం మహబూబాబాబాద్ పట్టణ కేంద్రంలోని ఏటిగడ్డ తండా వద్ద ఏర్పాటు చేసిన రైతు వేదిక భవన్‌లో లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థాని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తనూ కట్టికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. గ్రూపులు కాకుండా ఒకే గుంపుగా పని చేసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి బాసటగా నిలువాలన్నారు. ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ నిరుపేదల ఆరాధ్యుడిగా సీఎం కేసీఆర్ నిలుస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం అక్కడి లబ్దిదారులతో రెడ్యా మాట్లాడారు. సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. సీఎం కేసీఆర్‌తోనే కులవృత్తులకు పూర్వవైభవం సంతరించుకుందని అన్నారు.

సంగారెడ్డిలో ఎర్రోల్ల పర్యటన

సంగారెడ్డి,డిసెంబర్17 (నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి పట్టణం బైపాస్ రోడ్‌లోని జోగిని కాలనీలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పర్యటించారు. కాలనీలో రోడ్లు, మురికి కాలువలు పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జోగినులు శ్రీనివాస్‌ను కోరారు. పెంటమ్మ అనే మహిళతో కమిషన్ చైర్మన్ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ముగ్గురు మృతి

కామారెడ్డి,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఓ పెళ్లింట విషాదం చోటుచేసుకుంది. బిచ్కుంద మండలం చిన్నదేవాడలో ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ట్యాంకర్‌తో నీళ్లు తీసుకువస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులు తుకారాం, సాయిలు, శంకర్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా డ్రైవర్ ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని.. అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తెల్లవారితే పెళ్లి జరగాల్సిన ఇంట్లో ముగ్గురు మృత్యువాత పడడంతో స్థానికంగా విషాదచాయలు అలుముకున్నాయి.

భద్రకాళిని దర్శించుకున్న ఎంపి, మంత్రులు

వరంగల్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): భద్రకాళి అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీ

రైతుల ఆందోళనలు, దేశ ఆర్థిక పరిస్థితిపై చర్చలకు ఎగనామం

శీతాకాల సమావేశాల రద్దుపై శివసేన మండిపాటు

ముంబై,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): పార్లమెంట్ శీతాకాల సమావేశాలను నిర్వహించకూడదని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై శివసేన తీవ్ర విమర్శలు చేసింది. ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతున్న రైతుల ఆందోళన, దేశ ఆర్థిక పరిస్థితి, చైనాతో సరిహద్దు వివాదం వంటి తదితర అంశాలపై చర్చను తప్పించాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటుందని ఆరోపించింది. ప్రతిపక్షాలకు ప్రశ్నలు అడిగే అవకాశం ఇవ్వకుండా సమావేశాలు రద్దు చేశారంటూ శివసేన తన సామ్నా తన సంపాదకీయంలో విమర్శించింది. ఇది ఏ ప్రజాస్వామ్య అభ్యాసం ? ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల నుంచి స్వరాలు బలంగా ఉంటేనే దేశం సజీవంగా ఉంటుందని పేర్కొంది. పార్లమెంట్‌లో ప్రజాస్వామ్య సంప్రదాయాలు దేశానికి స్ఫూర్తినిస్తాయని, ప్రధాని నరేంద్ర మోదీ ఈ సంప్రదాయాలను తప్పక పాటించాలని సూచించింది. కొవిడ్ మహమ్మారి కారణంగా ఈ ఏడాది పార్లమెంట్ శీతాకాలు సమావేశాలు జరుగవని, బ్జడెట్ సమావేశాలను 2021 జనవరిలో సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల కేంద్రం తెలిపిన విషయం విధితమే. 'కరోనా మహమ్మారి ఎన్నికలనే ఆపలేదని, ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశం.. కానీ పార్లమెంట్ నాలుగు రోజుల శీతాకాల సమావేశాలను అనుమతించం' అనడంపై విమర్శలు గుప్పించింది. అమెరికా ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిందని, ఇది సూపర్ పవర్ ప్రజాస్వామ్యం అని పేర్కొంది. కొవిడ్ కారణంగా మహారాష్ట్ర శాసనసభ సమావేశాల రెండు రోజులే నిర్వహించడంపై బీజేపీ రాష్ట్ర యూనిట్ చేసిన విమర్శలను సైతం ప్రస్తావించింది. ప్రజాస్వామ్యంపై ఆ పార్టీ అభిప్రాయాలు 'దాని సౌలభ్యం ప్రకారం' మారుతాయని విమర్శించింది.

అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జేపీ నడ్డా పశ్చిమ బెంగాల్ పర్యటనను సైతం ప్రస్తావించింది.

దేవాలయాలను తిరిగి తెరవాలని బీజేపీ (మహారాష్ట్ర) నేతలు అనేక సార్లు వీధుల్లోకి వచ్చారని.. కానీ ప్రజాస్వామ్యం అత్యున్నత ఆలయాన్ని తెరవకపోవడంపై వైఖరిని చెప్పాలని డిమాండ్ చేసింది. కరోనాకు భయపడి పార్లమెంట్‌కు లాక్ వేస్తే.. ఈ నిబంధన దాని ఒక్కదానికే ఎందుకు పరిమితం చేశారని ప్రశ్నించింది. సరిహద్దులో మోహరించిన జవాన్లు కూడా కొవిడ్-19 కారణంగా స్వస్థలాలకు తిరిగి రావాలా? అనే దానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. కరోనాతో లోక్‌సభ 'లాక్' చేయాల్సి వస్తే కొత్త పార్లమెంట్ భవనం ఎందుకు నిర్మిస్తున్నారని, ఎందుకు రూ.900 కోట్లు ఖర్చు చేస్తున్నారని, తాళం వేసేందుకేనా? అంటూ ప్రశ్నించింది.

వనపర్తి జిల్లాలో రోడ్ల మరమ్మతులకు రూ. 27.60 కోట్లు

వనపర్తి, డిసెంబర్17: వనపర్తి జిల్లా పరిధిలోని రోడ్ల మరమ్మతులు, బ్రిడ్జిలు, కాజ్‌వే, కల్వర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 27.60 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి మంత్రి నిరంజన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వనపర్తి - పెబ్బేరు, పెబ్బేరు - యాపర్ల, ఎన్ హెచ్ 7 - నాటవల్లి (వయా పామాపూర్, రామకృష్ణాపూర్, అప్పరాల) దారిలో దెబ్బతిన్న చోట మరమ్మతులు చేపట్టనున్నారు. వనపర్తి - పెబ్బేరు 2, పెబ్బేరు - యాపర్ల 1, ఎన్ హెచ్ 7 - వెంకటాపూర్ వయా సూగూరు 1, ఘణపురం - కొత్తమొల్గర 1, వనపర్తి - జడ్చర్ల 1(గోపాల్ పేట సమీపంలో), వనపర్తి - కొల్లాపూర్ 1(కేతేపల్లి సమీపంలో) వరదల కారణంగా ఇబ్బందులు కలగకుండా కొత్త వంతెనలను నిర్మించనున్నారు. అవసరమైన ప్రతి చోటా రహదారుల నిర్మాణం చేపడుతామని మంత్రి తెలిపారు. వర్షాలొచ్చినా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

- వనపర్తి - పెబ్బేరు రహదారికి రూ.6.80 కోట్లు
- పెబ్బేరు - యాపర్ల రహదారికి రూ.కోటి
- నాటవల్లి - అప్పరాల రహదారికి రూ.3.90 కోట్లు
- వనపర్తి - పెబ్బేరు రహదారిలో కల్వర్టు నిర్మాణానికి రూ.1.70 కోట్లు
- వనపర్తి - పెబ్బేరు రహదారిలో కాజ్ వే నిర్మాణానికి రూ.1.70 కోట్లు
- వనపర్తి - కొల్లాపూర్ రోడ్డులో కేతేపల్లి దగ్గర కాజ్ వే నిర్మాణానికి రూ.3 కోట్లు
- ఖిల్లా ఘణపురం - కొత్త మొల్గర మధ్యన కాజ్ వే నిర్మాణానికి రూ.2 కోట్లు
- పెబ్బేరు - యాపర్ల మధ్యన కాజ్ వే నిర్మాణానికి రూ.2 కోట్లు
- వెంకటాపూర్ - సూగూర్ మధ్యన రోడ్ డ్యాం నిర్మాణానికి రూ.3 కోట్లు
- వనపర్తి - జడ్చర్ల మధ్యన బుద్దారం గండి దగ్గర వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు
- వివిధ మరమ్మతులు, ఇతర దెబ్బతిన్న రహదారుల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు

విశ్వకుగ్రామంలో వలసదారులు..!

(18 డిసెంబర్ 'అంతర్జాతీయ వలసదారుల దినం' సందర్భంగా)

మానవ చరిత్రలో వలసల ఘటనలు ఓ ముఖ్యమైన అధ్యయనంగా విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్నాయి. వ్యక్తులు విపత్తులకు దూరంగా, పని శోధనలో, మెరుగైన జీవితం కోసం, ప్రాణ రక్షణ నిమిత్తం సరిహద్దులు దాటి వలసల దారులు పడుతున్నారు. ప్రపంచీకరణ, సులభ రవాణ, కమ్యూనికేషన్ విప్లవం, ఆధునిక నైపుణ్యాలే నవ్య ఆయుధాలుగా వలసలు పెరుగుతూ అంతర్జాతీయ ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. దేశాలు మేధో సంపత్తిని ఇతర దేశాల నుండి ఆహ్వానిస్తూ, మోధో వలసలు ఊపందుకున్నాయి. దేశాల ఆర్థిక మరియు ఉద్యోగ అవకాశాల ఆధారంగా అంతర్జాతీయ వలసలు జరుగుతున్నాయి. వలసల్లో దాగి ఉన్న పలు సవాళ్ళు, సంక్లిష్టాలు, అంతర్జాతీయ వలసలతో ఇమిడి ఉన్న కష్టాల వంటి సమస్యలను అధిగమించడానికి దేశాల మధ్య సమన్వయం మరియు పరస్పర సహకారం అనివార్యం అవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో దేశాల నడుమ వలసల క్రమబద్ధీకరణ, వలసదారుల హక్కుల పరిరక్షణ మరియు అక్రమ వలసల కట్టడి జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 272 మిలియన్ల వలసదారులు, వీరిలో 41 మిలియన్ల వివాదాస్పద వలసదారులు, కొత్త జీవితాలను కోరుకుంటూ, నవ్య సమాజాలను ఆశగా నిర్మించుకుంటున్నారు. వలసదారులు అందరూ ఏకమై, శ్రమ చేస్తూ, ఆటపాటలతో ఆనందంగా సహజీవనం చేసే రోజులు రావాలి.

వలసదారుల మరియు వారి కుటుంబ సభ్యుల సంరక్షణ లక్ష్యంగా 18 డిసెంబర్ 1990న 'ఐరాస' జనరల్ అసెంబ్లీ తీర్మానం చేసింది. దీనికి అనుగుణంగా అంతర్జాతీయ వలసదారుల సమస్యలు, సంక్లిష్టాలు మరియు సవాళ్ళను అవగాహన చేసుకుంటూ, పరిష్కారాలు చర్చించే వేదికగా ప్రతియేటా 18 డిసెంబర్ రోజున 'అంతర్జాతీయ వలసదారుల దినం' జరుపుకోవడం జరుగుతున్నది. లిబియా, సిరియా, వెనెజులా, భారత్ లాంటి దేశాలు అంతర్జాతీయ వలసలతో సతమతం అవుతున్నాయి. 1971 ఇండో పాక్ యుద్ధసమయంలో 10 మిలియన్ల బంగ్లాదేశీయులు ప్రాణాలు అరచేతులో పెట్టుకొని భారత్‌కు వలసలు రావడం, మానవీయ కోణంలో భారత ప్రభుత్వం వారిని శరణార్థులుగా ఆదుకోవడం జరిగింది. మెక్సికో దేశస్థులు అమెరికాలోకి చొరబడడం కూడా వింటున్నాం. ఇలాంటి వలసలు నేటికీ పలు దేశాల్లో జరుగుతున్నాయనేది వాస్తవం. అంతర్జాతీయ వలసదారుల సాంఘీక ఏకీకరణ, గౌరవం, మర్యాద, శ్రమదోపిడి, హక్కుల ఉల్లంఘన, శాంతి భద్రతలు, సంఘీభావాలను చర్చించేందు చొరవ తీసుకోవాలి. దిక్కు తోచని స్థితిలో భవిష్యత్తు కోసం స్వంత ఇల్లు వదలడం అత్యంత విచారకరమే కాదు కొన్ని సార్లు ప్రమాదకరం కూడా కావచ్చు. సాధారణంగా వలసదారులను ద్వితీయ శ్రేణి పౌరులుగా భావించుట జరుగుతుంది. వలసదారులు దేశాభివృద్ధిలో భాగస్వాములు అయినప్పటికీ, ఆ అమాయక జీవుల శ్రమదోపిడి, స్వేచ్ఛ హరించడం, హక్కుల ఉల్లంఘన సర్వసాధారణంగా జరుగుతూనే ఉన్నాయి.

మిలియన్ల బంగ్లాదేశీయులు మరియు పాకిస్థాన్ చొరబాటుదారులు భారతదేశంలోకి అక్రమ వలసలు పెద్ద సమస్యగా అవతరిస్తున్నాయి. భారతదేశం నుండి అత్యధిక వలసలు, దాదాపు 40 శాతం (2 మిలియన్లు) యూఏఈకి జరుగుతున్నాయని తేలింది. ఇండియా నుంచి విదేశాలకు వలసలు జరగడానికి ముఖ్య కారణంగా వివాహాలే అని తేలింది. వలసల్లో 46 శాతం, అందులో 97 శాతం మహిళలు వివాహం చేసుకొని విదేశాలకు వలస వెళుతున్నారు. మహారాష్ట్ర మరియు ఢిల్లీల్లోకి అత్యధిక వలసలు నమోదు అవుతున్నాయి. భారతదేశంలో అంతర్ రాష్ట్ర వలసలు 50 కోట్ల దాటాయని తేలింది. 2019 గణాంకాల ప్రకారం మహానగరాల్లో 29 శాతం జనాభా దినసరి కూలీలుగా, వారిలో అత్యధికులు వలసదారులుగా ఉన్నారు. మన దేశంలోని వలసల్లో 25 శాతం యూపీ (4 - 6 మిలియన్లు) మరియు 14 శాతం బీహార్ (2.5 మిలియన్లు) ప్రజలు వలసదారులుగా ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు. రాజస్థాన్, యంపిల నుంచి కూడా వలసలు ఎక్కువగానే జరుగుతున్నాయి. స్వస్థలం వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్ళినా లేదా సరిహద్దులు దాటి ఇతర దేశాల్లో అడుగిడినా, దానికి కారణం వారి నిస్సహాయత, ఆర్థిక దుస్థితి లేదా అవకాశాల లేమి అని భావించాలి. వలసదారులను చులకనగా చూడడం అమానవీయం, ఆక్షేపణీయం. వలసదారులకు ఇవ్వాల్సిన గౌరవం, మర్యాద మరియు హక్కులు ఇవ్వాల్సిందే, వారిని అక్కున చేర్చుకొని సమాజంలో కలుపుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

20 నసిరిసిల్ల ప్రీమియర్ లీగ్-2 సమావేశం

-ప్రీమియర్ లీగ్ డైరెక్టర్ కిసరి నాగరాజు

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి):సిరిసిల్ల ప్రీమియర్ లీగ్ (ఎస్ పి ఎల్ 2) క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ కోసం సమావేశం ఈనెల 20 తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నిర్వహిస్తున్నట్టుప్రీమియర్ లీగ్ డైరెక్టర్ కిసరి నాగరాజు తెలిపారు. సమావేశం అనంతరం మీడియా సమావేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారుఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజన్న సిరిసిల్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పూర్మాని రామ్ లింగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ద్యావన పెల్లి రామస్వామి. ప్రధాన కార్యదర్శి వంకాయల కార్తీక్, ప్రశాంత్ రావు, బొడ్డు శ్రీధర్ అసోసియేషన్ సభ్యులు మరియు ,స్టార్ క్రికెట్ క్లబ్ సభ్యులు హాజరవుతారని కిసరి నాగరాజు పేర్కొన్నారు.

నిరుపేదల పాలిట వరం... టి.ఆర్.కె

- ప్రతి పేదింటి ఆడబిడ్డ వివాహాలకు తనవంతు సహాయం
- నూతన వధూవరులను ఆశీర్వదించిన టి ఆర్ ట్రస్ట్ సభ్యులు..

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి):నిరుపేద ల పాలిట వరంగా, ప్రతి పేదింటి ఆడబిడ్డలు వివాహాలకు తనవంతు సహాయం చేస్తూ



ఆదుకుంటున్న దానకర్ణుడు అన్న తోట రామ్ కుమార్ మంచి పేరు కు మారుపేరుగా టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ నిలుస్తున్నారు. వేములవాడ పట్టణంలోని ఓల్డ్ అర్బన్ కాలనీ లో నిరుపేద కుటుంబానికి చెందిన సంటి లక్ష్మమ్మ కుమార్తె సంటి రజిత తన వివాహానికి ఆర్థిక సహాయం చేయాలని టి.ఆర్.కె ట్రస్ట్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు పెట్టుకుంది. నిరుపేద కుటుంబానికి సహాయం చేయాలనే గొప్ప సంకల్పంతో టి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ ఆదేశాల మేరకు టి ఆర్ కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పెళ్ళికి టి ఆర్ కె ట్రస్ట్ సభ్యులు హాజరై తమ వంతు సహాయంగా నగదును అందజేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా టి.ఆర్.కె ట్రస్టు ఎంక్వయిరీ టీమ్ సభ్యుడు మాకాశీ కార్తీక్ మాట్లాడుతూ ప్రతి పేదింటి ఆడబిడ్డ వివాహానికి తోట రామ్ కుమార్ తన వంతు సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారన్నారు. నిరు పేద ఆడబిడ్డ వివాహానికి టి.ఆర్.కె ట్రస్ట్ సభ్యుల రాకతో పచ్చని పందిరి లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో టి.ఆర్.కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు, ఎంక్వయిరీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లతో నిరుపేదల ముఖాల్లో ఆనందం

పక్కాగా లెక్కలు తీసి లబ్దిదారుల ఎంపిక
మరో వేయి ఇళ్లను త్వరలోనే నిర్మిస్తాం
కెసిఆర్ నగర్‌లో ఇళ్లను ప్రారంభించిన మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): పేదల మోములో ఆనందపు వెలుగులు నింపేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా, ఖర్చుకు వెనుకాడకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నిరుపేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు పేర్కొన్నారు. గురువారం సిద్దిపేట పట్టణం కేసీఆర్ నగర్‌లో 180 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఎఫ్‌డీసీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, స్థానిక మున్సిపల్ ఛైర్మన్ రాజనర్సుతో కలిసి మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అర్హులైన నిరుపేదలకు ఇళ్లు దక్కడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇంకా మిగిలిన 1000 ఇండ్లకు సంబంధించి పున: పరిశీలన పక్రియ జరుగుతుందని వారిలో అర్హులైన వారికి త్వరలోనే రెండు పడక గదుల ఇళ్లను కేటాయిస్తామన్నారు. ఏ ఒక్క నిరుపేదకు అన్యాయం జరగకూడదన్న ధ్యేయంతో సాంకేతికత దన్నుగా బిగ్

దేటాతో సరిపోల్చుతూ...అర్హులు మాత్రమే లబ్ది పొందేలా చూస్తున్నామన్నారు. మరో 1000 ఇండ్లు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా వెంటనే మంజూరు చేశారన్నారు హరీశ్ రావు. బహిరంగ మార్కెట్‌లో రూ.15 లక్షలు విలువ చేసే డబుల్ బెడ్ రూం ఇండ్లను సకల సౌకర్యాలతో పేదలకు ఉచితంగా అందిస్తున్నామన్నారు హరీశ్ రావు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశీస్సులతో... సర్సాపూర్‌లో 2460 రెండు పడక గదుల ఇల్ల నిర్మాణం సకల సౌకర్యాలతో ప్రైవేట్ ఇండ్ల సముదాయాలకు ధీటుగా పూర్తి చేశామన్నారు. ఈ ఇళ్ళు నిర్మించేందుకు మాకు నాలుగేళ్ల సమయం పట్టిందని మంత్రి తెలిపారు. ఈ నాలుగేళ్లలో నాలుగు వందల సార్లు నిర్మాణ స్థలాన్ని సందర్శించి స్వంత ఇంటి మాదిరి మనసు పెట్టి ఇండ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. మొదటి దశలో 1341 మంది లబ్దిదారులను గుర్తించామని మంత్రి తెలిపారు. నిజమైన పేదలకు ఇల్లు దక్కాలని ఆరు నెలలు కష్టపడి ఏలాంటి ఆరోపణలకు తావులేకుండా పేదరికమే ప్రామాణికంగా అర్హులను మాత్రమే ఎంపిక చేశామన్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా అధికారులతో సహా 200కు పైగా అధికారులు అహర్నిశలు శ్రమించారని మంత్రి గుర్తు చేశారు. ఇండ్ల కేటాయింపులో రాజకీయ జోక్యం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. తొలి దశలో ముఖ్యమంత్రి సమక్షంలో 144 మంది లబ్దిదారులు.. ఈ రోజు 180 మంది గృహ ప్రవేశాలు చేశారన్నారు. ప్రతీ ఇంట్లో విద్యుత్, నల్లా, గ్యాస్ కనెక్షన్, పైపులు అన్ని సక్రమంగా పని చేస్తున్నాయో లేదో సరి చూసుకుంటూ దశల వారీగా లబ్దిదారులకు పట్టాలు అందిస్తూ గృహ ప్రవేశాలు జరిగేలా చూస్తున్నామన్నారు. లబ్దిదారులకు పట్టాలు అందజేసే సమయంలోనే.... పట్టా ఉత్తర్వుతో పాటు..నల్లా కనెక్షన్ మంజూరు పత్రం, కరెంట్ కనెక్షన్ , ఇంటి నెంబర్, పైపుడ్ గ్యాస్ కనెక్షన్ లు అందజే స్తున్నామన్నారు. అంతే కాకుండా స్వంత అన్నయ్యలా ఆశీర్వదిస్తూ.. నూతన వస్త్రాలు బహూకరించి గృహ ప్రవేశాలు చేపిస్తున్నాము. కేటాయించిన పక్కా ఇండ్లను పదికాలాల పాటు కాపాడు కోవాల్సిన బాధ్యత లబ్దిదారుదే అన్నారు. ఇండ్లను కిరాయికి ఇచ్చినా, అమ్ముకున్నా తిరిగి స్వాధీనం చేసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాజనర్సు, వైస్ ఛైర్మన్ అక్తర్ పటేల్, సుడా (ఎస్‌యూడీఏ) వైస్ ఛైర్మన్ రమణ చారి, మున్సిపల్ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్ నగర్ ప్రజల సౌకర్యార్థం మంత్రి తన్నీరు హరీష్ రావు బస్సు సేవలను ప్రారంభించారు. ప్రతీ రోజూ కేసీఆర్ నగర్ నుంచి కోటి లింగాలు, కాల కుంట వరకు బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి. నిన్న మొన్నటిదాకా కిరాయి ఇంట్లో ఉంటూ... నేడు స్వతింటి కల సాకారం కావడంతో లబ్దిదారుల్లో డబుల్ సంతోషం వెల్లి విరిసింది. గృహ ప్రవేశాలు సందర్భంగా లబ్దిదారులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. మా సొంతింటి కల సాకారం చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావులకు సదా రుణపడి ఉంటామన్నారు.

నా వ్యాఖ్యలను వక్రీకరించారు

సంక్షేమ పథకాల రద్దుపై స్పందించిన లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్,డిసెంబర్17 (ఆర్ఎన్ఎ): ప్రజలకు మంచి చేస్తే మరచిపోతారని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రద్దు చేయాలనే వ్యాఖ్యలపై టీఆర్ఎస్ జడ్చర్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి స్పందించారు. తాను అలా అనలేదని, తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించి ప్రసారం చేసిందని అన్నారు. పనిచేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తుంచుకోవాలని అర్థం వచ్చేలా తాను నిన్న మాట్లాడానని చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రభుత్వాలు ఏవైనా ప్రజలకు మేలు చేస్తే ఆ ప్రభుత్వాలను ఆదరించాలి. నేను నిన్న చేసిన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించి ప్రసారం చేశాయి'అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్, జడ్చర్ల మండల కేంద్రాలలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లక్ష్మారెడ్డి మంగళవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన మాటలు సంచలనంగా మారాయి. జనాలకు మంచిచేస్తే మరిచిపోయే అలవాటుందని, ఏడాదిపాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రద్దు చేయాలని కేసీఆర్‌ను కోరుతానని లక్ష్మారెడ్డి మాట్లాడినట్టు వార్తలు వెలువడ్డాయి. ఆయన వ్యాఖ్యలు రాజకీయ రంగం దుమారం లేపాయి. టీఆర్ఎస్ శ్రేణుల్లోనూ అసహనం వ్యక్తమైంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు యాసంగి నీటి ప్రణాళిక

20నుంచి ఎల్ఎండి కింద..28నుంచి పైన విడుదల

హైదరాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): ఎల్ఎండి కింద ఈ నెల 20వ తేదీ నుంచి, ఎల్ఎండి పైన ఈ నెల 28 నుంచి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ యాసంగిలో ఎస్ఆర్ఎస్పీ నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నీటి విడుదలపై ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. బుధవారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, రసమయి బాలకిషన్, రవిశంకర్, జెడ్పీ ఛైర్మన్ పుట్టా మధుకర్, ఎస్ఆర్ఎస్పీ ఎస్ఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు. నీటి కొరత లేనప్పటికీ వృధా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని మంత్రులు ఈ సందర్భంగా రైతులను కోరారు. మెట్ట, వరి, చెరకుతో పాటు అన్ని పంటలకు నీళ్లు సమృద్ధిగా అందుతాయన్నారు. రైతులందరూ కూడా వచ్చే మార్చి నెల 31వ తేదీ కల్లా తాము వేసిన పంటలు చేతికొచ్చే విధంగా పంట ప్రణాళికలు వేసుకోవాలన్నారు. ఏప్రిల్ నెలలో వడగండ్ల వానలు పడే అవకాశం ఉంటుంది కాబట్టి పంటలు నష్టపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రులు రైతులకు సలహానిచ్చారు.

అట్రాసిటీ లేని రాష్ట్రం దిశగా ఎస్సీ ఎస్టీ కమిషన్ కృషి..!

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్.

సంగారెడ్డి, డిసెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రం అట్రాసిటీ లేని రాష్ట్రంగా రూపుదిద్దుకునేలా ఎస్సీ ఎస్టీ కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.

గురువారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా

ప్రతినిధులతో మాట్లాడుతూ తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ మిగతా రాష్ట్రాలకు మోడల్ గా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏర్పాటైన తొలి ఎస్సీ ఎస్టీ కమిషన్ నూతన ఒరవడిని సృష్టించిందన్నారు. కమిషన్ అన్ని జిల్లాల్లో తిరుగుతూ క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పి ఓ ఎ, పీసీఆర్ చట్టాలను పటిష్టంగా అమలు చేయడానికి కమిషన్ పనిచేస్తుందన్నారు. ఎక్కడా లేని విధంగా జన అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చేస్తున్నామన్నారు.

రాష్ట్రంలో 10,500 అట్రాసిటీ కేసులు నమోదు కాగా ఇప్పటి వరకు 8 వేల కేసులు పరిష్కరించామన్నారు. అట్టి కేసులలో బాధితులకు 56 కోట్ల 60 లక్షల రూపాయల రిహాబిలిటేషన్/ పరిహారం అందించామని తెలిపారు. రాష్ట్రంలో 12000 గ్రామ పంచాయతీలకు గాను 8,600 పంచాయతీలలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించామన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ కు కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయని, ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి రక్షణగా ఉండి జన అదాలత్ ద్వారా ఉచితంగా సత్వర న్యాయం జరిగేలా పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అధికారుల సమక్షంలో నేడు రేపు జన అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో జన అదాలత్ ద్వారా 60 కేసులకు గాను 50 పరిష్కరించామని, ఉమ్మడి జిల్లాలో పెండింగ్ లో ఉన్న 10 కేసులను విచారించి పరిష్కరించ నున్నట్లు తెలిపారు.

ఖమ్మం, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ల్లో నిర్వహించిన జన అదాలత్ లు విజయవంతమైనట్టు తెలిపారు. జన అదాలత్ నిర్వహిస్తున్న మూడవ జిల్లా ఉమ్మడి మెదక్ జిల్లా అన్నారు. ఎస్సీ ఎస్టీ బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కమిషన్ పి ఓ ఎ, పి సి ఆర్ చట్టాలపై ఎస్సీ ఎస్టీ వర్గాలకే కాకుండా ఇతర వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. చట్టాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు విద్యాసాగర్, రామ్ బల్ నాయక్, లీలా దేవి పాల్గొన్నారు.

అనంతరం జన అదాలత్ ని కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్లో నిర్వహించి కేసులను విచారించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ కార్యదర్శి జి.ఎస్. పద్మాదాస్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, కమిషన్ సభ్యులు ఉమ్మడి మెదక్ జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారులు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, రెవిన్యూ , పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అంతకుముందు సంగారెడ్డి బైపాస్ రోడ్డు లోగల జోగినిల కుటుంబాల గృహాలను కమిషన్ చైర్మన్ సభ్యులు సందర్శించారు. సంబంధితు లతో మాట్లాడుతూ ఎంతమందికి ఇండ్లు ఇచ్చారు?ఎంత మంది నివాసం ఉంటున్నారు? ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు.

32 మందికి ఇండ్లు ఇచ్చారని అందులో ప్రస్తుతం 8 మంది మాత్రమే నివాసం ఉంటున్నా మని, మిగతావారు అమ్ముకుని వెళ్ళినట్లుగా చైర్మన్ కు తెలిపారు.

రోడ్లు లేవని, నీళ్లు రావడం లేదని స్థలాలను ఆక్రమిస్తున్నారని చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చారు.

అందుకు చైర్మన్ స్పందిస్తూ ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్థలాలను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ కార్యదర్శి, సభ్యులు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్ డి ఓ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి మల్లేశం తదితరులు పాల్గొన్నార